మార్నింగ్ కాఫీ విత్ హాట్ న్యూస్‌తో...! మీ

# డ్రీమ్ టైమ్స్

తెలుగు దిన పత్రిక

శుక్రవారం 06-02-2026
పేజీలు: 8 వెల: రూ.2/-

సంపుటి:5 సంచిక 107

Published from Kurnool circulated all over Andhra Pradesh and Telangana All District

## విలేకరులు కావలెను




తెలంగాణ ,ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా డ్రీమ్ టైమ్స్ దినపత్రికలో బ్యూరో, మండలాల రిపోర్టర్ గా పని చేయుటకు జిల్లాల, నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహవంతులైన యువతి ,యువకులు కావలెను, కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును

8500066609

# ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది



## రాష్ట్రపతి ధన్యవాద తీర్మానంపై రాజ్యసభలో మోడీ

- వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం పరుగులు
- రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్
- 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నాం
- ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణల అమలు
- దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదు
- మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్ స్థానం
- కాంగ్రెస్‌కు దూరదృష్టి లేదు..ఓట్ బ్యాంక్ రాజకీయాలు
- విపక్షాల నిరసనల...నినాదాలు..చివరకు వాకౌట్

న్యూఢిల్లీ,-ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్

వికసిత్ భారత్ లక్ష్యం దిశగా దేశం ప్రస్తుతం దూసుకెళుతోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రస్తుతం అన్ని జీవిత పార్శ్వాల్లో, వర్గాల్లో మార్పులు కనిపిస్తున్నాయని అన్నారు. సరైన దిశలో దేశం ముందుకు సాగుతోందని అన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బ్జడెట్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ప్రధాని మోదీ రాజ్యసభలో ప్రసంగించారు. విపక్ష నేతల నిరసనలు, నినాదాల నడుమ ప్రధాని ప్రసంగించారు. ఆ తరువాత కొద్ది సేపటికే విపక్షాలు వాకౌట్ చేశాయి. అయితే, ప్రధాని మాత్రం తన ప్రసంగాన్ని కొనసాగించారు. స్వాతంత్ర్యం తొలి నాళ్లల్లో భారత్ ప్రపంచంలో 6వ

-మిగతా 3 లో




## అందుబాటులోకి భారత్ ట్యాక్సీ

- ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్
- తొలుత ఢిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు
- ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చు
- రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలు
- యాప్‌ను ప్రారంభించిన అమిత్ షా

న్యూఢిల్లీ-

ప్రైవేటురంగ ట్యాక్సీ సంస్థలు ఓలా, ఉబర్, ర్యాపిడోకు పోటీగా కేంద్ర ప్రభుత్వం భారత్ ట్యాక్సీ పేరిట కొత్త యాప్‌ను తీసుకొచ్చింది. కేంద్రమంత్రి అమిత్ షా గురువారం ఈ యాప్‌ను ప్రారంభించారు. ప్రయోగాత్మకంగా చేపట్టిన సేవలు విజయవంతమైన నేపథ్యంలో ఎట్టకేలకు అందుబాటులోకి తెచ్చారు. తొలుత ఢిల్లీ-రాజధాని ప్రాంతం, గుజరాత్ రాష్ట్రాల్లో సేవలు లభిస్తాయి. రాబోయే మూడేళ్లలో కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, ద్వారక నుంచి కామాఖ్య వరకు భారత్ ట్యాక్సీ సేవలను తీసుకొస్తామని అమిత్‌షా పేర్కొన్నారు. ఇందులో లాభాలు డ్రైవర్లకే వెళతాయని చెప్పారు. ఈ ప్లాట్‌ఫామ్ ద్వారా కార్లు, త్రీవీలర్లు, టూవీలర్లు బుక్ చేసుకోవచ్చని తెలిపారు. దేశంలో క్యాబ్ బుకింగ్ సేవల్లో ఉబర్, ఓలా, ర్యాపిడో వంటి సంస్థలు

-మిగతా 3 లో

# తిరుమల పవిత్రతను దెబ్బతీసే కుట్ర

## వైకాపా పాలనలో ఓ పథకం ప్రకారం దాడి

- తప్పుచేసిన వైకాపా ఎదురుదాడికి దిగుతోంది
- కనీస పాశ్చాత్తాపం లేకుండా విమర్శలు
- కల్తీ నెయ్యి వినియోగంపై ఏకసభ్య కమిషన్
- అన్ని వివరాలను కమిటీ ముందుంచుతాం
- దేవుడి పవిత్రతను దెబ్బతీయాలనుకున్న వారిని వదలబోం
- మీడియా సమావేశంలో సీఎం చంద్రబాబు నాయుడు స్పష్టీకరణ

అమరావతి, -ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్

: తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వినియోగ వ్యవహారంపై ఏకసభ్య కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఈ కమిటీ ఎదుట అన్ని నివేదికలు ఉంచుతామని తెలిపారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసే మహాకుట్రకు వైకాపా పాల్పడిందన్నారు. తిరుమల శ్రీవారి ప్రతిష్టను దెబ్బతీసేలా కార్యక్రమాలకు పాల్పడ్డారని మండిపడ్డారు. గురువారం రాజధాని అమరావతిలో డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్, బిజెపి అధ్యక్షుడు మాధవ్ తదితరులతో కలసి సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. లడ్డూ వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని ఇప్పటికే సీబీఐ నివేదిక ఇచ్చిందన్నారు. ఈ విషయంలో తప్పుచేసిన వారిని వదిలే ప్రసక్తే లేదని

-మిగతా 3 లో

శ్రీవారికి అపచారం అంటగట్టే కుట్రలు







## భగవంతుడిపైనా పగబట్టిన వైసీపీ

- వైసీపీ హయాంలో వరుసబెట్టి హిందుత్వపై దాడులు
- ఆలయాలు ధ్వంసం...రథం దగ్ధం..ఆభరణాల చోరీ
- సిట్ నివేదికలో వైసీపీకి ఎక్కడా క్లీన్‌చిట్ ఇవ్వలేదు
- మీడియా సమావేశంలో పవన్ కళ్యాణ్ ఆగ్రహం


అమరావతి, -ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్

తిరుమల శ్రీవారి లడ్డూ కల్తీ విషయంపై ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సున్నిత అంశాలపై చాలా ఆలోచించి మాట్లాడాలని తెలిపారు. సిట్ నివేదికను సీఎం చంద్రబాబు తమకు చదివి వినిపించారని ప్రస్తావించారు. జంతువుల కొవ్వు కలిసిందని చెప్పడం చాలా సున్నిత అంశమని పేర్కొన్నారు. మాట్లాడేటప్పుడు పర్యవసానాలు ఆలోచించే ముందుకెళ్తామని చెప్పుకొచ్చారు. సీఎం చంద్రబాబు నివాసంలో భేటీ అనంతరం పవన్ కల్యాణ్ మీడియాతో మాట్లాడారు.

-మిగతా 3 లో

## భారత్ స్వేచ్ఛగా ఇంధనాన్ని కొనుగోలు చేయవచ్చు

- ఇంధనం సరఫరా అంశంలో తమ విధానంలో ఎటువంటి మార్పు ఉండదు



3 లో



## ప్రతి ఎకరాకు నీరందేలా చూడాలి

- నీటి సంరక్షణ మన అందరి బాధ్యత
- సమర్థంగా నీటిని వినియోగిస్తే కరువు రాదు
- సాగునీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో చంద్రబాబు

అమరావతి -

ప్రతి ఎకరాకు నీరిచ్చేలా నీటి సంఘాల ప్రతినిధులు కృషి చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపునిచ్చారు. నీటి భద్రత అందరికీ కావాలి.. కానీ, సంరక్షణను చాలా మంది పట్టించుకోవటం లేదన్నారు. రాష్ట్రంలోని 40 జీవనదుల నీటిని సమర్థంగా నియోగించుకుంటే కరవు అనేదే ఉండదని చెప్పారు. అమరావతిలో జరిగిన నీటి సంఘాల అధ్యక్షుల సమావేశంలో సీఎం మాట్లాడారు. పరుగెత్తే నీటిని నిలపండి, నడిచే నీటిని జలాశయంగా మార్చండి.. భూగర్భ జలాశయంలో నీటి నిల్వ పెరిగేలా చూడాలని తెలిపారు. రైతు ఆత్మహత్యలకు కేంద్రంగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌ను రైతు సానుకూలప్రదేశ్‌గా మారుస్తున్నామని వెల్లడించారు. సాగునీటి సంఘాలకే నామినేషన్ కింద పనులు ఇస్తున్నందున.. ప్రతీ ఎకరాకూ నీరిచ్చేలా పనిచేయాలని సూచించారు. నీటి సంఘాల పనులకు జీఎస్టీ లేకుండా చూస్తామని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో చేసిన పనులకు కూడా చెల్లింపులు చేసే బాధ్యత కూటమి ప్రభుత్వానిదని పేర్కొన్నారు. నీటి పన్నులు కూడా వసూలు చేసుకుని సమర్థంగా కాలువల నిర్వహణ చేసుకోవచ్చని వెల్లడించారు. 6,700 నీటి వినియోగదారుల సంఘాలు, 58 డిస్టిబ్యూటరీ కమిటీలు, ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహించామని గుర్తు చేశారు. సరైన సమయానికే రబీ, ఖరీఫ్ సాగు కోసం నీరు ఇచ్చేలా ప్రణాళిక చేద్దామని పిలుపునిచ్చారు.

-మిగతా 3 లో

## గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

- సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం



3 లో

## కేశవ్‌కు ఆర్థిక శాఖపైనే అవగాహన లేదు

### తక్కువ ధరలకు కొంటే కల్తీ జరిగినట్లా

- ఇంతకూ కూటమి నేతలు ఏం చెప్ప దల్చుకున్నారు
- ప్రభుత్వ తీరుపై మండిపడ్డ మాజీమంత్రి పేర్ని నాని



అమరావతి, -ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్

కూటమి ప్రభుత్వం ముసుగులో నారా చంద్రబాబు ప్రభుత్వం ఉందని.. ఇంతకీ చంద్రబాబు, పవన్, మాధవ్, కేశవ్ ప్రజలకు ఏం చెప్పదలుచుకున్నారని మాజీ మంత్రి పేర్ని నాని ప్రశ్నించారు.. లడ్డూ వివాదంపై తాజాగా మాజీ మంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. కేశవ్ తన ఆర్థిక శాఖ గురించి, ప్రభుత్వ అప్పుల గురించి పట్టదు. ఆ శాఖను ఆయన నడుపుతారా.. చంద్రబాబు నడుపుతారా తెలియదన్నారు..

-మిగతా 4 లో

# శ్రీవారికి చంద్రబాబు ఒక్కడే భక్తుడా

## జగన్‌ను దెబ్బతీయడమే బాబు లక్ష్యం



- అందుకే వ్యవస్థలను వాడుకున్నారు
- ఇప్పుడేమో శ్రీవారిని వాడుకుంటున్నారు
- టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి

తిరుపతి, -ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్

వైసీపీ, మాజీ సీఎం జగన్‌ను నాశనం చేయాలని సీఎం చంద్రబాబు అనేక కుట్రలు చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి అన్నారు. దానికోసం ఇప్పటి దాక వ్యవస్థలను వాడుకున్నారు.. ఇప్పుడు వేంకటేశ్వర స్వామిని వాడుకుంటున్నారని విమర్శించారు. దొరికిపోయిన దొంగలు అనేలా

-మిగతా 4 లో

## మణిపూర్ బీజేపీ సర్కార్‌కు తొలిరోజే నిరసన సెగ

- డిప్యూటీ సీఎం కిప్‌జెన్‌పై కుకీల ఆగ్రహం
- నేడు బంద్‌కు కుకీ గ్రూపుల పిలుపు




ఇంఫాల్, -

మణిపూర్‌లో కొత్తగా ఏర్పడిన ప్రభుత్వానికి తొలిరోజే నిరసన సెగ తగిలింది. ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం చేసిన నెంచా కిప్‌జెన్‌కు వ్యతిరేకంగా కుకీ గ్రూపులు శుక్రవారం మణిపూర్ బంద్‌కు పిలుపునిచ్చాయి. కుకీ-జో తెగకు చెందిన సభ్యులు బుధవారం సాయంత్రం ఢిల్లీలోని మణిపూర్ భవన్ ఎదుట నిరసన తెలిపారు. కుకీ తెగకు ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు బంద్ పాటిస్తున్నట్లు జాయింట్ ఫోరమ్ ఆఫ్ సెవన్(జెఎఫ్7) ప్రకటించాయి.తమ సమిష్టి నిర్ణయానికి వ్యతిరేకంగా కుకీ తెగకు చెందిన ఏ ఎమ్మెల్యే అయినా ప్రభుత్వంలో చేరితే జరిగే పర్యవసనాలకు తమ సంస్థ బాధ్యత తీసుకోదని కుకీ-జో కౌన్సిల్ హెచ్చరించింది. ప్రభుత్వంలో చేరవద్దని తమ ఎమ్మెల్యేలను కొన్ని కుకీ గ్రూపులు కూడా హెచ్చరించాయి. ముఖ్యమంత్రిగా వై ఖేమ్‌చంద్ సింగ్ బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉప ముఖ్యమంత్రిగా కుకీ తెగ నుంచి నెంచా కిప్‌జెన్ నియమితులు

-మిగతా 3 లో

# 20 ఏళ్ల అమ్మాయి ప్రెగ్నెన్సీ కేసులో 17 మందికి డీఎన్ఏ పరీక్ష..

## పాజిటివ్‌గా తేలిన తండ్రి శ్యాంపిల్

**ముంబై: --ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
ముంబై లో జరిగిన ఓ గ్యాంగ్ రేప్ ఘటన .. షాకింగ్ విషయాలను బయటపెట్టింది. గ్యాంగ్‌రేప్‌కు గురైన 20 ఏళ్ల మానసిక దివ్యాంగురాలి కేసులో అనూహ్యమైన కోణం బయటపడింది. గర్భం దాల్చిన ఆ అమ్మాయితో సన్నిహితంగా ఉన్న 17 మందికి డీఎన్ఏ పరీక్షలు నిర్వహించారు. అయితే ఆ రిపోర్టులో ఆ అమ్మాయి తండ్రే పాజిటివ్‌గా తేలినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ కేసులో కఫే పరేడ్ పోలీసులు తండ్రిని అరెస్టు చేశారు.పోలీసుల ప్రకారం.. గత ఏడాది అక్టోబర్‌లో కామా అండ్ ఆల్బ్‌లెస్ ఆస్పత్రి పోలీసు స్టేషన్‌కు ఓ ఫోన్‌కాల్ వచ్చింది. 20 ఏళ్ల మానసిక దివ్యాంగురాలు తమ ఆస్పత్రిలో ఉన్నట్లు పేర్కొన్నారు. కడుపు నొప్పితో ఉన్న ఆమెను .. అయిదు నెలల ప్రెగ్నెంట్‌గా గుర్తించారు. అయితే ఆ అమ్మాయిని అనేక మంది లైంగికంగా




వాడుకున్నట్లు తెలిసింది. సరైన రీతిలో మాటలు రాకపోవడంతో.. పోలీసులు ఈ కేసులో లోతుగా దర్యాప్తు చేపట్టారు. ఆమెతో పరిచయం ఉన్న 16 మంది నుంచి డీఎన్ఏ శ్యాంపిళ్లను సేకరించారు. దాంట్లో తండ్రి, కుటుంబభ్యులు, పొరుగింటోళ్లు ఉన్నారు. ఆ మహిళ ప్రెగ్నెన్సీని పోలీసులు టర్మినేట్ చేశారు. ఆమె గర్భస్త పిండం నుంచి డీఎన్ఏను సేకరించారు. కలినా ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌కు పంపారు. జనవరి 27వ తేదీ రిపోర్టు వచ్చింది. తండ్రి నుంచి సేకరించిన డీఎన్ఏతో బాధిత వ్యక్తి పిండం నుంచి సేకరించిన డీఎన్ఏ శ్యాంపిళ్లు మ్యాచ్ అయినట్లు గుర్తించారు. ఆ నివేదిక ఆధారంగా తండ్రిని అరెస్టు చేశారు. ఇదే కేసులో కఫే పరేడ్ మురికివాడకు చెందిన ఇద్దరు వ్యక్తులను కూడా అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు చెప్పారు. వారిపై ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కానీ ఇప్పుడు డీఎన్ఏ శ్యాంపిళ్లతో తండ్రి పాత్ర తేలినట్లు పోలీసులు వెల్లడించారు. భయం వల్ల బాధితురాలు తన తండ్రి పేరు చెప్పలేదని పోలీసులు తెలిపారు. అయితే ఇటీవల నిర్వహించిన కౌన్సిలింగ్ సెషన్ల సమయంలో ఆమె కొన్ని విషయాలు చెప్పిందన్నారు. తండ్రి కూడా తనను లైంగికంగా వేధించినట్లు పేర్కొందన్నారు. అనేక రకాల థెరపీలు ఇచ్చి .. బాధితురాలు మాట్లాడేటట్లు చేశామన్నారు.

# యువత, మహిళలకు మమత తాయిలాలు.

### ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా మధ్యంతర బడ్జెట్

**న్యూఢిల్లీ, -ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
పశ్చిమ బెంగాల్‌లో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ ఓటర్లను ఆకట్టుకోవడమే లక్ష్యంగా మమతా బెనర్జీ ప్రభుత్వం మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టింది. టీఎంసీ ఆధ్వర్యంలోని మమత ప్రభుత్వం గురువారం అసెంబ్లీలో రూ.4.06 లక్షల కోట్ల అంచనాతో బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. ఆర్థిక శాఖ మంత్రి చంద్రిమ భట్టాచార్య బడ్జెట్ వివరాల్ని సభలో అందించారు.ఈ బడ్జెట్‌లో యువత, మహిళల్ని లక్ష్యంగా చేసుకున్నట్లు కనిపిస్తోంది. బంగ్లార్ యువ సతి అనే స్కీం ద్వారా 21-40 లోపు నిరుద్యోగులకు నెలనెలా



రూ.1,500 అందించనున్నారు. ఇప్పటికే అమలవుతున్న లక్ష్మీ భండార్ స్కీం ద్వారా మహిళలకు ఇకపై రూ.1,500 ఇస్తారు. ఇప్పటివరకు ఈ పథకం ద్వారా వెయ్యి రూపాయలు మాత్రమే ఇచ్చేవారు. అంగన్‌వాడీ, ఆశా వర్కర్లకు నెలనెలా రూ.1,000 అలవెన్స్ పెంచారు. అంగన్‌వాడీల కుటుంబ సభ్యులకు ఐదు లక్షల ప్రమాద బీమా అందిస్తారు. సివిక్ వాలంటీర్లకు, గ్రీన్ పోలీస్ పర్సనల్స్‌కు అందించే వేతనాన్ని కూడా వెయ్యి రూపాయలు పెంచారు. ఇక ప్రభుత్వ ఉద్యోగులకు 4 శాతం డీఏ పెంచారు. బడ్జెట్ ప్రవేశపెట్టిన సందర్భంగా మమతా బెనర్జీ మాట్లాడుతూ.. తమది మహిళలు, యువతకు మేలు చేసే బడ్జెట్ అన్నారు. కేంద్ర బడ్జెట్‌లాగా దశా, దిశానిర్దేశం లేని బడ్జెట్ కాదన్నారు. ఇచ్చిన హామీలను నెరవేర్చడమే తమ ప్రాధాన్యమన్నారు. ఇది ప్రజల బడ్జెట్ అని, ఎలాంటి గిమ్మిక్కులు లేవని వ్యాఖ్యానించారు. వేతనాల పెంపు, డీఏ పెంపు వంటివి తక్షణమే అమల్లోకి వస్తాయన్నారు.

# మేఘాలయ బొగ్గుగనిలో పేలుడు

**18మంది కూలీలు మృతి**
**గాయపడిన ఒకరిని ఆస్పత్రికి తరలింపు**
**చిక్కుకుపోయిన మరికొంత మంది**

**షిల్లాంగ్ -ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
మేఘాలయలోని తూర్పు జైంతియా హిల్స్ జిల్లాలోని బొగ్గుగనిలో గురువారం భారీ పేలుడు సంభవించింది. ఈ ప్రమాదంలో 18 మంది కూలీలు ప్రాణాలు కోల్పోయారు. ఓ వ్యక్తి గాయపడగా అతడిని ఆస్పత్రికి తరలించారు. ప్రమాదం జరిగిన సమయంలో గనిలో ఎంత మంది చిక్కుకుపోయారో తెలియాల్సి ఉంది. పోలీసులు, రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ నోంగ్రాంగ్ తెలిపిన వివరాల ప్రకారం... ఉదయం థాంగ్స్కు ప్రాంతంలోని బొగ్గుగనిలో తవ్వకాలు చేపడుతున్న సమయంలో భారీ పేలుడు





సంభవించింది. ఈ ఘటనలో 18 మంది కూలీలు మృతి చెందారు. ఒకరు గాయపడగా అతడిని మొదట సుత్‌గా ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం షిల్లాంగ్‌లోని ఆస్పత్రికి తరలించినట్టు తూర్పు జైంటియా హిల్స్ పోలీసు సూపరింటెండెంట్ వికాస్ కుమార్ తెలిపారు. ప్రమాదం జరిగిన సమయంలో మరికొంత మంది గనిలోనే చిక్కుకుపోయినట్టు సమాచారం. వీరంతా అసోంకు చెందినవారిగా తెలుస్తోంది. ఘటనా స్థలంలో రెస్క్యూ బృందాలు సహాయక చర్యలు చేపడుతున్నాయి. పేలుడుకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే ఈ గనిని అక్రమంగా నిర్వహిస్తున్నట్టు అనుమానాలు ఉన్నాయి. 2014లో, నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ (ఎన్జీటీ) మేఘాలయలో రాట్-హోల్ బొగ్గు తవ్వకం, ఇతర అశాస్త్రీయ మైనింగ్ పద్ధతులను నిషేధించారు. అలాగే పర్యావరణ నష్టం, కార్మికుల భద్రతా సమస్యల కారణంగా నిషేధం విధించబడింది. రాట్-హోల్ మైనింగ్ అంటే చాలా ఇరుకైన సొరంగాలను తవ్వడం. సాధారణంగా 3-4 అడుగుల ఎత్తు ఉంటుంది. బొగ్గును తీయడానికి కార్మికులు ఈ సొరంగాల్లోకి ప్రవేశిస్తారు. ఈ సొరంగాలు చాలా ఇరుకుగా, ఒకసారి ఒక వ్యక్తి మాత్రమే వాటిలోకి ప్రవేశించగలడు. అయితే సుప్రీంకోర్టు ఆ తరువాత ఈ నిషేధాన్ని సమర్థించింది, శాస్త్రీయ, నియంత్రిత , పర్యావరణ సురక్షితమైన నియమాల ప్రకారం మాత్రమే మైనింగ్‌ను అనుమతించింది.

# స్కిడ్ గేమ్ చూసినందుకు మరణ దండన

### ఉత్తర కొరియాలో కఠిన శిక్షలు: ఆమ్నెస్టీ

**న్యూఢిల్లీ, -ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
స్కిడ్ గేమ్ వంటి దక్షిణ కొరియా టీవీ షోలను వీక్షించినా, కే-పాప్‌ను ఆలకించినా ఉత్తర కొరియా ప్రభుత్వం తన ప్రజలకు మరణశిక్ష విధిస్తున్నదని మానవ హక్కుల సంస్థ ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ తాజాగా వెల్లడించింది. దక్షిణ కొరియాకు చెందిన మీడియాను వినియోగించినా స్కూలు పిల్లలను సైతం ఉత్తర కొరియా ప్రభుత్వం కఠినంగా శిక్షిస్తున్నదని ఆమ్నెస్టీ తెలిపింది.విదేశీ కంటెంట్ వాడకంపై యువజనులను హెచ్చరించడానికి బహిరంగ మరణశిక్షలను బలవంతంగా వారికి చూపిస్తున్నదని ఉత్తర కొరియా నుంచి





తప్పించుకుని పారిపోయిన పౌరుల వాంగ్మూలాన్ని ఉటంకిస్తూ ఆమ్నెస్టీ వెల్లడించింది. ఆరోగ్యం, సామాజిక హోదాపై శిక్షలు ఆధారపడి ఉంటాయని, పేద ప్రజలు మరణంసహా కఠిన శిక్షలను ఎదుర్కోవలసి ఉంటుందని, పలుకుబడి ఉన్న లేదా సంపన్న కుటుంబాల వారు అధికారులకు లంచాలు ఇచ్చి మరణశిక్షలను తప్పించుకుంటారని హక్కుల సంస్థ వివరించింది.

# ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్!

### మెయిల్స్‌ను పోస్ట్ చేసిన మహువా మొయిత్రా



**న్యూఢిల్లీ,-ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
అమెరికాకు చెందిన లైంగిక నేరస్తుడు జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు చెందిన ఎప్‌స్టీన్ ఫైల్స్ దేశ రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. మొన్నటికి మొన్న ప్రధాని మోదీ పేరు ఈ ఫైల్స్‌లో ప్రస్తావనకు రాగా, కేంద్ర పెట్రోలియంశాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి కూడా తాజాగా ఈ జాబితాలో చేరారు. భారత్‌లో జరిగే ఓ పెండ్లికి తన సన్నిహితురాలు తప్పనిసరిగా హాజరవ్వాలని, దానికోసం వెంటనే వీసాను జారీ చేయాలని ఎప్‌స్టీన్.. హర్దీప్‌కు ఓ మెయిల్ రాయగా, ఆయన వెంటనే స్పందించి తగిన ఏర్పాట్లు చేశారు.ఈ మేరకు టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా ఎక్స్‌లో పోస్ట్ చేశారు. హర్దీప్-ఎప్‌స్టీన్ మధ్య మెయిల్ రూపంలోని సంభాషణనూ ఆమె అప్‌లోడ్ చేశారు. దీంతో ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో ఇంకెంతమంది బీజేపీ పెద్దలు బయటకు వస్తారో? అంటూ సోషల్‌మీడియాలో చర్చ జరుగుతున్నది.

# 12 మంది మావోయిస్టుల లొంగుబాటు



**కొత్తగూడెం ప్రగతి-ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
: మావోయిస్టు పార్టీకి చెందిన 12 మంది మావోయిస్టులు ఛత్తీస్‌గఢ్ బీజాపూర్ జిల్లా పోలీసు అధికారుల ఎదుట లొంగిపోయారు. అందులో 8 మంది మహిళా సభ్యులు ఉన్నారని బీజాపూర్ ఎస్పీ జితేంద్రకుమార్ యాదవ్ పేర్కొన్నారు. లొంగిపోయిన వారిలో డివిజినల్ కమిటీ సభ్యుడు సోమడు మడకం, పార్టీ సభ్యులు హుంగి కుంజం, పాయకి కుంజం ఉన్నట్లు వివరించారు. 12 మందిపై మొత్తం రూ.46 లక్షల రివార్డులు ఉన్నట్లు వెల్లడించారు.

# బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలపై సుప్రీంకోర్టుకు పీకే



**న్యూఢిల్లీ, -ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
గత ఏడాది నిర్వహించిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్ని సవాల్ చేస్తూ 'జన్ సురాజ్ పార్టీ' నాయకుడు ప్రశాంత్ కిశోర్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. బీహార్ అసెంబ్లీకి మళ్లీ ఎన్నికలు నిర్వహించాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు శుక్రవారం విచారణ చేపట్టనున్నది.ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన తర్వాత బీహార్ ప్రభుత్వం ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పథకం కింద ప్రతి మహిళకు రూ.10 వేలు పంపిణీ చేయడాన్ని, ఎన్నికల కోడ్‌కు విరుద్ధమంటూ పిటిషన్‌లో ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు.

# జీ రామ్ జీ ఉపసంహరించాలి..

### కేరళ అసెంబ్లీ తీర్మానం

**తిరువనంతపురం**
**-ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
కేంద్రం కొత్తగా తీసుకొచ్చిన 'వీబీ జీ రామ్ జీ' చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ కేరళ అసెంబ్లీ గురువారం ఓ తీర్మానాన్ని ఆమోదించింది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ



ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరించాలంటూ కేంద్రాన్ని కోరింది.కేరళ మంత్రి రాజేశ్ తీర్మానాన్ని ప్రవేశపెడుతూ, 'పూర్తిగా కేంద్ర ప్రాయోజిత పథకమైన 'నరేగా' చట్టం వలె కాకుండా, జీరామ్ జీ పథకం కింద రాష్ట్రం 40% వ్యయాన్ని భరించాల్సి ఉంటుంది' అని అన్నారు

# అందుబాటులోకి భారత్ ట్యాక్సీ




మొదటి తరువాయి

కీలక భూమిక పోషిస్తున్నాయి. డ్రైవర్ల నుంచి ఆయా సంస్థలు కొంతమొత్తం కమిషన్‌గా వసూలు చేస్తున్నాయి. వారి శ్రమను ఆయా కంపెనీలు దోచుకుంటున్నాయనే ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మల్టీ స్టేట్ కోపరేటివ్ సొసైటీస్ యాక్ట్ కింద 2025 జూన్ 5న 'భారత్ ట్యాక్సీ'కి కేంద్రం రూపకల్పన చేసింది. జీరో కమిషన్, సర్జ్‌ప్రైసింగ్ లేని విధానం, డ్రైవర్లకు లాభాలు పంచిపెట్టడం దీని ముఖ్య ఉద్దేశం. దిల్లీ-ఎన్‌సీఆర్, గుజరాత్‌లో డిసెంబర్ 2 నుంచి ప్రయోగాత్మకంగా సేవలందిస్తున్నారు. ఇప్పటి వరకు 3 లక్షల డ్రైవర్లు ఇందులో చేరగా.. లక్ష మంది యూజర్లు రిజిస్టర్ అయ్యారు. రోజుకు 10 వేల రైడ్లు జరిగాయి. సుమారు రూ.10 కోట్లను డ్రైవర్లకు లాభాలుగా అందింనట్లు కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ పేర్కొంది. డ్రైవర్లకు 'సారథి' పేరిట ఆరోగ్య, ప్రమాద బీమా, రిటైర్మెంట్ సేవింగ్స్ కూడా లభిస్తాయి.

## భారత్ స్వేచ్ఛగా ఇంధనాన్ని కొనుగోలు చేయవచ్చు

ఇంధనం సరఫరా అంశంలో తమ విధానంలో ఎటువంటి మార్పు ఉండదు

మాస్కో:




ఏ దేశం నుంచి అయినా భారత్ స్వేచ్ఛగా ఇంధనాన్ని కొనుగోలు చేయవచ్చు అని రష్యా పేర్కొన్నది. చమురు, ఇంధనం సరఫరా అంశంలో తమ విధానంలో ఎటువంటి మార్పు ఉండదని క్రెమ్లిన్ వెల్లడించింది. భారత్‌కు కేవలం రష్యా మాత్రమే ఇంధనాన్ని సరఫరా చేయడం లేదని, ఇతర దేశాల నుంచి కూడా చమురును భారత్ కొనుగోలు చేస్తోందని, దీంట్లో కొత్తగా మేం ఏం చేసేది లేదని రష్యా ప్రతినిధి దిమిత్ర పీస్కోవ్ తెలిపారు. రష్యా నుంచి ఇంధనం కొనుగోలును ఆపేందుకు ప్రధాని మోదీ అంగీకరించారని, రష్యాకు బదులుగా ఇక నుంచి వెనిజులా నుంచి భారత్ ఆయిల్‌ను కొంటుందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రష్యా ప్రతినిధి పెస్కోవ్ స్పందిస్తూ .. తమ నుంచి ఇంధనం కొనుగోలు ఆపేస్తున్నట్లు ఇండియా నుంచి ఎటువంటి ప్రకటన రాలేదన్నారు.

## గ్రూప్-1 ఉద్యోగులకు ఊరట

సింగిల్ బెంచ్ తీర్పును రద్దు చేసిన ధర్మాసనం

హైదరాబాద్,



: గ్రూప్ 1 ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు తెలంగాణ హైకోర్టు ఊరట కల్పించింది. గ్రూప్ 1 నియామకాల వ్యవహారంలో సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ చీఫ్ జస్టిస్ నేతృత్వంలోని ధర్మాసనం తీర్పు వెలువరించింది. గతంలో.. గ్రూప్ 1 నియామకాలపై విచారణ చేపట్టిన సింగిల్ బెంచ్ ధర్మాసనం.. జనరల్ ర్యాంకింగ్ లిస్టును రద్దు చేస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే మెయిన్స్ పరీక్ష జవాబు పత్రాలను పునః మూల్యాంకనం చేయాలని నాడు న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ టీజీపీఎస్సీతో పాటు ఇప్పటికే ఎంపికైన అభ్యర్థులు హైకోర్టులో పిల్ వేశారు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ప్రధాన న్యాయమూర్తి.. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును కొట్టివేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. తుది తీర్పునకు లోబడి గ్రూప్ 1 నియామకాలు చేపట్టవచ్చని ఇప్పటికే గతంలో ధర్మాసనం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసిన విషయం తెలిసిందే. ఆ ఉత్తర్వుల ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేసింది.

## మణిపూర్ బీజేపీ సర్కార్‌కు తొలిరోజే నిరసన సెగ

మొదటి తరువాయి

కావడంతో బుధవారం కంగ్‌పోక్పీ జిల్లాలో నిరసనలు వెల్లువెత్తాయి. తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తూ నిరసనకారులు లీమాఖోంగ్ సమీపంలో రోడ్లను అడ్డగించి టైర్లను కాల్చారు.

## ప్రతి ఎకరాకు నీరందేలా చూడాలి

మొదటి తరువాయి



వరితో పాటు ప్రత్యామ్నాయ పంటల వైపు కూడా రైతులు దృష్టి సారించాలని కోరారు. తద్వారా రైతులు ఎక్కువ ఆదాయం పొందేలా కార్యాచరణ చేపడతామని పేర్కొన్నారు. రైతులు ప్రకృతి సేద్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. నీటి వినియోగదారుల సంఘాలు కూడా వివిధ బాధ్యతలు తీసుకోవాలన్నారు. భూగర్భ జలాలు పెంచే బాధ్యతతో పాటు కాలువలు, ప్రాజెక్టుల ద్వారా నీటి నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది

మొదటి తరువాయి

అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉండేదని అన్నారు. కానీ, మునుపటి ప్రభుత్వాల విధానాల కారణంగా 2014 నాటికి 11వ స్థానికి పడిపోయిందని అన్నారు. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోందని అన్నారు. ఈయూ సహా 27 దేశాలతో భారత్ అనేక ఒప్పందాలు చేసుకుందని గుర్తు చేశారు. 9 దేశాలతో ట్రేడ్ డీల్ చేసుకుంటున్నామని చెప్పారు. రీఫార్మ్.. పెర్ఫార్మ్.. ట్రాన్స్‌ఫార్మ్ దిశగా భారత్ సాగుతోందని అన్నారు. ఉత్పత్తి రంగంలో అనేక విజయాలు సాధించామని చెప్పారు. ఎక్స్‌ప్రెస్ వేగంతో సంస్కరణలను తమ ప్రభుత్వం అమలు చేస్తోందని అన్నారు. భారత్‌లో ప్రతిభావంతమైన యువతకు కొరత లేదని వ్యాఖ్యానించారు. రానున్న 25 ఏళ్లు భారత్‌కు అత్యంక కీలకమని వ్యాఖ్యానించారు. దేశ ప్రగతి సాధనలో వెనకడుగు వేసేది లేదని కూడా తేల్చి చెప్పారు. ఒకప్పుడు భారత్ బలహీనమైన ఐదు ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉండేదని అన్నారు. ప్రస్తుతం మూడవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారుతోందని చెప్పారు. ప్రపంచ సవాళ్లకు భారత్ పరిష్కారాలు చూపించే స్థితిలో నిలిచి ఒక ఆశాకిరణంగా మారిందని అన్నారు. అధిక వృద్ధి రేటు, తక్కువ ద్రవ్యోల్బణం కలగలిసిన అరుదైన స్థితిలో భారత్ ఉందని అన్నారు. మునుపటి ప్రభుత్వాల తప్పులను సరిచేసేందుకే అధిక శాతం తమ శక్తియుక్తులను వినియోగించాల్సి వస్తోందని అన్నారు. గత ప్రభుత్వాల కారణంగా మూటగట్టుకున్న ప్రతికూల అభిప్రాయాన్ని తొలగించుకుంటున్నామని అన్నారు. ఈ నష్టాన్ని సరిచేసేలా భవిష్యత్తుకు తగిన విధానాలతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. గ్లోబల్ సౌత్‌గా పేరు పడ్డ దేశాల తరపున భారత్ అంతర్జాతీయ వేదికలపై బలంగా తన వాణిని వినిపిస్తోందని ప్రధాని మోదీ అన్నారు. ప్రపంచదేశాలకు విశ్వసనీయ భాగస్వామిగా భారత్ అవతరించిందని చెప్పారు. కాంగ్రెస్‌కు దార్శనికత




లేదని విమర్శించారు. ఫలితంగా భారత్ చాలా కాలం పాటు కష్టాలు పడిందన్నారు. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా వ్యవస్థలు బలహీనపడతాయని అన్నారు. ప్రపంచంలో అగ్రగామి దేశాలు భారత్‌తో వాణిజ్య ఒప్పందాల కోసం ఉత్సుకతతో ఉన్నాయని చెప్పారు. ఈయూ ట్రేడ్ డీల్‌తో ప్రపంచంలో స్థిరత్వంపై వివిధ దేశాలకు నమ్మకం పెరిగిందని అన్నారు. అమెరికాతో ఒప్పందంతో ఈ భావన మరింత బలపడిందని వ్యాఖ్యానించారు. ఇకపోతే కాంగ్రెస్‌పై ప్రధాని మోదీతీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆ పార్టీకి దూరదృష్టి, ఎటువంటి ప్రణాళిక లేదన్నారు. తనతోపాటు ఓ వర్గంపైనా ద్వేషాన్ని పెంచుకుంటోందన్నారు. ఇటీవల లోక్‌సభలో చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో ప్రసంగించిన ప్రధాని మోదీ.. దీనిపై లోక్‌సభలో చర్చ జరగకపోవడం అత్యున్నతపదవికే అవమానకరమన్నారు. దేశంలో ప్రతిభావంతులైన యువతకు కొరత లేదు. దేశం సరైన మార్గంలో వేగంగా పురోగమిస్తోంది. యూపీఏ హయాంలో భారత్ 11వ ఆర్థిక వ్యవస్థగా ఉంటే.. ఎన్డీయే హయాంలో మూడో స్థానానికి చేరుకోనుంది. ప్రపంచంలో భారత్ పరపతి పెరుగుతోంది. గతంలో మనతో ఒప్పందానికి పలు దేశాలు ముందుకొచ్చేవి కావు. ఇప్పుడు అభివృద్ధి చెందిన దేశాలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నాం. భారత్ వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన పరిస్థితి లేదు.

తయారీ రంగంలో బలమైన ఎకో సిస్టమ్ ఉంటేనే ఒప్పందాలకు ముందుకొస్తారు. రిఫార్మ్, పెర్ఫార్మ్, ట్రాన్స్‌ఫార్మ్.. నినాదంతో దూసుకెళ్తున్నాం. అన్ని విషయాల్లో పోటీ పడేందుకు భారత్ ఇప్పుడు సిద్ధంగా ఉంది. అనేక దేశాల్లో వృద్ధుల సంఖ్య పెరుగుతుండగా.. మనదగ్గర యువత జనాభా అధికంగా ఉంది. మన యువతకు ప్రపంచ దేశాలన్నీ స్వాగతం పలుకుతున్నాయి. బ్యాంకుల బలోపేతానికి అనేక సంస్కరణలు తెచ్చాం. ప్రభుత్వ రంగ సంస్థలకు అండగా నిలిచాం. బ్యాంకుల నుంచి ఇప్పుడు పేదలకు రుణాలు అందుతున్నాయి. ముద్ర యోజన ద్వారా అనేక మంది స్వయం ఉపాధి పొందుతున్నారు. దీని కింద రూ.30లక్షల కోట్ల రుణాలు ఇచ్చాం. 10కోట్ల మంది స్వయం సహాయక సంఘాల మహిళలు లబ్ది పొందారు. 2014 తర్వాత ఎ÷-లానింగ్ కమిషన్‌ను తీసేసి నీతిఆయోగ్‌ను తెచ్చాం. ఇది వేగంగా, సమర్థంగా పనిచేస్తోంది. అక్రమార్కులను రక్షించేందుకు బెంగాల్ ప్రభుత్వం కోర్టును ఆశ్రయిస్తోంది. అభివృద్ధి చెందిన దేశాలు కూడా అక్రమ వలసదారులను బయటకు పంపించివేస్తున్నాయి. బెంగాల్‌లో మాత్రం అటువంటి వారిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారు. దేశ ప్రజల హక్కులు హరిస్తున్నారని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

# తిరుమల పవిత్రతను దెబ్బతీసే కుట్ర

మొదటి తరువాయి

ఆయన కుండుబద్దలు కొట్టారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్ తప్పులు చేసి.. తమపై ఆరోపణలు చేస్తున్నారంటూ మండిపడ్డారు. దుర్మార్గాలు చేసి తిరిగి తమపై ఎదురుదాడి చేస్తున్నారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా ఏపీ సీఎం ఎండగట్టారు. వైసీపీ పాలనలో ఐదేళ్ల పాటు.. భక్తులు తిరుమలకు రావాలంటేనే అనుమానించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. వైసీపీ వాళు .. తనతోనే కాకుండా దేవుడితోనూ పెట్టుకున్నారని తెలిపారు. వైఎస్ జగన్ అన్యమతస్థుడు కావచ్చు.. కానీ డిక్లరేషన్ ఇచ్చి ఆయన దర్శనం చేసుకోవాల్సి ఉంటుందన్నారు. శ్రీవారిపై జగన్‌కు నమ్మకం ఉంటే డిక్లరేషన్ ఎందుకు ఇవ్వలేదంటూ ప్రశ్నించారు. దేవుడి పవిత్రత దెబ్బతీసేందుకే లడ్డూలో రసాయనాలు కలిపారని విమర్శించారు. రసాయనాలు కలిపారని సీబీఐ ఛార్జ్‌షీట్‌లో ఉందని స్పష్టం చేశారు. ఈ మహాపాపంపై వైసీపీ నేతలు క్షమాపణలు చెప్పారా? అని సీఎం ప్రశ్నించారు. ఈ మహాపాపంపై ప్రతి ఒక్కరూ చర్చించాలన్నారు. మాపైనే ఎదురుదాడి చేస్తారా? మీకు ఈ ధైర్యం ఎవరిచ్చారు?' అంటూ వైసీపీ నేతలను సీఎం చంద్రబాబు సూటిగా ప్రశ్నించారు. 'పరకామణి కేసును సెటిల్‌మెంట్ చేసి సమర్థిస్తారా?' అని వైసీపీ అగ్రనేతల వైఖరిని చంద్రబాబు తప్పుబట్టారు. అలాగే దొంగతనం చేసిన వారిని సమర్థిస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది వేంకటేశ్వర స్వామిపై దాడేనని ఆయన అభివర్ణించారు. 'మహా పాపం చేశారు.. క్షమాపణలు చెప్పాలి' అంటూ వైసీపీ నేతలను డిమాండ్ చేశారు. తప్పు చేసినవారికి దేవుడు ఎలాంటి శిక్ష వేస్తాడో మీరే చూస్తారన్నారు ముఖ్యమంత్రి. దేవుడి పవిత్రతను దెబ్బతీయాలనుకునే వారిని ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. దోషులను కచ్చితంగా శిక్షిస్తామన్నారు. దేవుడి పవిత్రతను కాపాడలేనంత అసమర్థులం కాదన్న చంద్రబాబు.. కూటమి నేతలు ఎక్కడైనా బూతులు మాట్లాడారా? అని



ప్రశ్నించారు. ఇప్పటికీ వైసీపీ నేతలు బూతులు మాట్లాడుతూనే ఉన్నారంటూ మండిపడ్డారు. ఇక.. తిరుమలలో ఇటీవల కొన్ని అపచారాలు జరిగాయని చంద్రబాబు అన్నారు. లడ్డూ కల్తీ ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు. 2003లో తనపై హత్యాయత్నం జరిగితే శ్రీవారే కాపాడారని.. అలాగే గతంలో ఏడుకొండలు కాదు.. రెండు కొండలని మాట్లాడారని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేసుకున్నారు. వైసీపీ పాలనలో వారి ప్రవర్తన పరాకాష్ఠకు చేరిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రామతీర్థంలో రాముడి తల తీసేశారని.. ప్రశ్నిస్తే తనపై కేసు పెట్టారని చెప్పారు. అంతర్వేది, దుర్గగుడిలో దుర్మార్గాలపై చర్యలు తీసుకోలేదని వివరించారు. మరోవైపు 2022లో రిపోర్ట్‌లో కల్తీ జరుగుతోందంటే.. ఆ నివేదికను కావాలనే తొక్కి పెట్టారని ముఖ్యమంత్రి చెప్పారు. తాను సీఎం కాగానే తిరుమల తిరుపతి దేవస్థానం ప్రక్షాళన ప్రారంభించానని వివరించారు. నెయ్యిలో పొరపాట్లు జరుగుతున్నాయని శాంపిల్స్ నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ బోర్డుకి పంపామన్నారు. వైసీపీ తప్పుచేసి తిరిగి మమ్మల్నే క్షమాపణలు చెప్పమంటున్నారని పేర్కొన్నారు. బూతులు తిడితే నోరుమూసుకుని కూర్చోవాలంటున్నారంటూ వైసీపీ నేతలు వ్యవహరిస్తున్న తీరును ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. తిరుమల లడ్డూ కల్తీ వ్యవహారంలో వైకాపానేతలు బుకాయిస్తే వాస్తవాలు మారతాయా అని ఏపీ సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. దౌర్జన్యం, రౌడీయిజం చేస్తే సహించబోనని చెప్పారు. దేవుడితో పెట్టుకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు. తిరుమల పవిత్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. తప్పుచేసి దాని నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు మాపై వైకాపా నేతలు దుష్ప్రచారం చేస్తున్నారు. బూతులు తిట్టినా మేం భరించాలా? దోషులను అన్ని విధాలుగా శిక్షిస్తాం. ఈ వ్యవహారంలో చర్యలు తీసుకోవాలని సీబీఐ మాకు ఓ నివేదిక పంపింది. ఏక సభ్య కమిషన్ వేసి అన్నీ పరిశీలిస్తాం. అవసరమైతే కోర్టులో కూడా అదనపు సమాచారం చేరుస్తాం. ఇది ప్రజల మనోభావాలకు సంబంధించిన అంశం. ఇంతవరకు చరిత్రలో వెంకన్నస్వామి జోలికి ఎవరూ రాలేదు. దేవుడికి అపచారం జరిగినప్పుడు ముక్తకంఠంతో ఖండించాల్సిన బాధ్యత మనపై ఉంది. అపవిత్రం జరిగినప్పుడు భగవంతుడే ప్రజలను సమాయత్తం చేస్తారు. మీరు చేసిన పని దుర్మార్గమైన అపచారం అని చంద్రబాబు అన్నారు.

# భగవంతుడిపైనా పగబట్టిన వైసీపీ

మొదటి తరువాయి

ఐదేళ్లు తామే అధికారంలో ఉంటామని.. రాజకీయ లబ్ది కోసం మాట్లాడాల్సిన అవసరం ఏముందని పవన్ ప్రశ్నించారు. భగవంతుడిపైనా వైసీపీ పగబట్టిందని ధ్వజమెత్తారు. అందరం ఏడు కొండలు అంటామని.. వైసీపీ వాళ్లు రెండు కొండలు అంటారని అన్నారు. వైసీపీ హయాంలో హిందూ మతంపై చాలా దాడులు జరిగాయని ఆరోపణలు చేశారు. రామతీర్థంలో శ్రీరామచంద్రుడి విగ్రహం ధ్వంసం చేశారని ఫైర్ అయ్యారు. దుర్గమ్మ ఆలయంలో చోరీ జరిగితే.. ఇవి పోతే ఇంకొకటి కొందామన్నారని చెప్పుకొచ్చారు. అంతర్వేదిలో రథం కాలిపోతే ఎవరో పిచ్చివారు చేశారని చెప్పారన్నారు. నెయ్యి కల్తీ అంశంలో మతాల ప్రస్తావన లేదని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. 'తప్పు చేసి క్షమాపణ అడగకుండా మమ్మల్నే క్షమాపణ అడుగుతున్నారు. శ్రీవారి విషయంలో తప్పుచేసిన వారు నాశనమైపోతారు. సిట్ రిపోర్ట్ ఎక్కడా వైసీపీకి క్లీన్‌చిట్ ఇవ్వలేదన్నారు. రిపోర్ట్‌లో జంతువుల కొవ్వు ఉందని స్పష్టంగా ఉంది. భగవంతుడితో పెట్టుకున్నవారు సర్వనాశనం అయిపోతారు తప్ప బతికున్న



దాఖలాలు లేవు. ఇప్పటికైనా చేసిన మహాపాపానికి దేవుడిని క్షమాపణ కోరుకోవాలి. భగవంతుడికి మోకరిల్లే వరకూ విషయాన్ని వదిలిపెట్టం. హిందూ ధర్మాన్ని కాపాడే విషయంలో చాలా స్పష్టంగా ఉన్నాం. కల్తీ లడ్డూ వ్యవహారం ముమ్మాటికీ తెలిసి చేసిన నేరం. 2022లోనే కల్తీ నిర్ధారణ అయ్యింది. అయినా అయోధ్యకు అవే కల్తీ లడ్డూలు పంపి మహాపాపానికి ఒడిగట్టారు' అని పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారు. కల్తీ లడ్డూ వ్యవహారంలో కళ్ల ముందు ఎన్నో వాస్తవాలు కనిపిస్తుంటే మాట్లాడకపోవటం సబబు కాదని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. 'అన్ని నివేదికలు.. ప్రసాదంలో వాడిన పదార్థాల్లో నెయ్యి లేదని నిర్ధారించాయి. ఎన్డీడీబీ జంతుకొవ్వు అవశేషాలు నిర్ధారిస్తే, తమ వద్ద అలాంటి పరీక్ష చేసే సామర్థ్యం లేదని ఎన్డీఆర్ఐ చెప్పింది. ప్రతీమాట భక్తుల మనోభావాలు, సెంటిమెంటును దృష్టిలో పెట్టుకునే మాట్లాడుతున్నాం. దేవుడి విషయాన్ని రాజకీయం చేయకూడదనే నిష్ఠతో వ్యవహరిస్తూ వస్తున్నాం. ప్రజలకు వాస్తవాలు చెప్పకుంటే అది ఇంకా పెద్ద తప్పు అవుతుందనే నిజాలు బయటపెడుతున్నాం. వైసీపీ హయాంలో పెద్దఎత్తున దేవాలయాలపై దాడులు జరిగితే ఎలాంటి చర్యలు తీసుకోలేదు' అని పవన్ కల్యాణ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# సంపాదకీయం

## పుర' పోరు కీలకం




రాష్ట్రంలో మరో రసవత్తర ఘట్టానికి తెరలేచింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిర్యాలగూడలో నిర్వహించిన బహిరంగ సభతో మున్సి'పోల్స్' వార్ హీటెక్కింది. అటు ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ కూడా ప్రచారాస్త్రాలను సిద్ధం చేసుకుంది. కేంద్రంలోని బీజేపీ సైతం 'ఏదో ఒకటి చేసి...' తెలంగాణ పురపోరులో తన సత్తా చాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఇందుకోసం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీబ్ సైతం రంగంలోకి దిగారు. జనసేనాధిపతి పవన్‌కళ్యాణ్‌ను కూడా ఇందుకోసం వినియోగించుకోవాలని ఆ పార్టీ నిర్ణయించింది. ఆయన కూడా త్వరలోనే ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. అందువల్ల తెలంగాణ ఓటర్లు ఇప్పుడు మరింత అప్రమత్తంగా ఉండాలి. ఇలా పార్టీలన్నీ మున్సిపల్ ఎన్నికల గోదాలో దిగిన వేళ... అసలు ఇప్పటిదాకా ఇటు రాష్ట్రాన్ని, అటు దేశాన్ని ఏలిన పార్టీలు.. నగరాలు, పట్టణాల అభివృద్ధికి తీసుకున్న చర్యల గురించి చర్చించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. 74వ రాజ్యాంగ సవరణ... పట్టణ స్థానిక సంస్థలకు సంబంధించి కొన్ని నియమ నిబంధనలను స్పష్టంగా పేర్కొంది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలోని పౌరులకు ఆరోగ్య సంరక్షణ, విద్యా పరిరక్షణ, గృహ నిర్మాణం, రవాణా తదితర కనీస అవసరాలను తీర్చాల్సిన బాధ్యత ఆయా స్థానిక సంస్థలపైన్నే ఉంటుందని తేల్చి చెప్పింది. కానీ దేశంలో సరళీకృత ఆర్థిక విధానాలు అమల్లోకి వచ్చిన తర్వాత ఈ మౌలిక సూత్రాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గాలికొదిలేశాయి. సమాఖ్య విధానంలో భాగంగా రాష్ట్రాలకు నిధులివ్వాల్సిన కేంద్రం... ఆ పని చేయకుండా వాటికి కోతలు పెడుతోంది. కేంద్రం ఏ విధంగానైతే రాష్ట్రాల పట్ల వివక్షను ప్రదర్శిస్తోందో.. అదే తరహాలో రాష్ట్రాలు సైతం పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థల పట్ల శీతకన్నేయటం మొదలుపెట్టాయి. వాటి నిధులను తమ అవసరాలకు వాడుకోవటమో, దారి మళ్లించటమో చేస్తూ మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు మొండిచేయి చూపిస్తున్నాయి. ఉమ్మడి రాష్ట్రంలోగాని, తెలంగాణ వచ్చిన తర్వాతగానీ ఈ విధానాల్లో మాత్రం ఎలాంటి మార్పు లేకపోవటం గమనార్హం. పైగా వివిధ దేశాల్లోని ఆర్థిక సంస్థల నుంచి ఇబ్బడిముబ్బడిగా అప్పులు తీసుకోవటం, వాటితో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని చెప్పటం, షరతుల్లో భాగంగా ప్రజలపై విపరీతమైన భారాలేయటం... ఇదీ ఇప్పటిదాకా కొనసాగిన తతంగం. జైకా (జపాన్ ఇంటర్నేషనల్ కో-ఆపరేటివ్ ఏజెన్సీ), జేఎన్ఎన్‌యూఆర్ఎమ్ (జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రిన్యూవల్ మిషన్) తదితర పేర్లతో ముందుకొచ్చిన సంస్థల అప్పులతో పట్టణాలు, నగరాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామంటూ పాలకులు గొప్పలకు పోయారు. జేఎన్ఎన్ యూఆర్ఎమ్ కింద ఆర్టీసీ బస్సులను కొనుగోలు చేసినప్పటికీ అవి ప్రయాణీకుల అవసరాలను పూర్తిగా తీర్చలేకపోయాయి. వాల్మీకి అంబేద్కర్ యోజన (వాంబే) కింద పేదలకు ఇండ్లు ఇచ్చామని చెప్పినప్పటికీ అవి హైదరాబాద్ సహా అనేక మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో పిట్టగూళ్లకు నమూనాలుగా మిగిలాయి. మంచినీరు, పారిశుధ్యం సంగతి సరేసరి. రాష్ట్రంలో హైదరాబాద్‌తోపాటు వివిధ పట్టణాలు, నగరాల్లో లెక్కకు మిక్కిలిగా ఫ్లై ఓవర్లు, స్కైవేలు, హైవేలు నిర్మిస్తున్న మాట వాస్తవమే. కానీ పేదోడి జీవితానికి.. వీటికి మధ్య అసలు పొంతనే లేకపోవటం గమనార్హం. వేలాది కోట్లు వెచ్చించి కార్పొరేట్లు, పెద్దోళ్ల కోసం వీటిని నిర్మిస్తున్న పాలకులు... కనీసం సగటు జీవి నడిచేందుకు ఫుట్‌పాత్‌లు నిర్మించకపోవటం శోచనీయం. ఆర్భాటంగా కనబడుతున్న హైవేలు, స్కైవేల సంగతి అటుంచితే.. సాధారణ, మధ్య తరగతి ప్రజలు వాడే రోడ్లు, గల్లీలు గుంతలమయంగా మారతున్నాయి. ఫలితంగా ప్రమాదాల్లో రోజూ అనేక మంది గాయాల పాలవుతున్నారు. వర్షాకాలంలో వరదలు, డ్రైనేజీ సమస్యలు, వేసవికాలంలో తాగునీటి ఎద్దడి పట్టణాల్లోని ప్రజలు వేధిస్తున్నాయి. ఒకవైపు గణనీయంగా పెరుగుతున్న పట్టణ జనాభా, ఇబ్బడిముబ్బడిగా కొనసాగుతున్న పట్టణీకరణ జిల్లా కేంద్రాలు, నగర పాలక సంస్థలతో పాటు రాష్ట్ర రాజధానిపై తీవ్రమైన ఒత్తిడిని పెంచుతున్నాయి. ఉపాధి, ఉద్యోగాల కోసం జనం వలసలు పోతున్న మాట వాస్తవమే అయినా.. వారికి చాలినంత పని కల్పించటంలో ఇటు లోకల్ బాడీలు, అటు స్టేట్ గవర్నమెంట్ పూర్తిగా విఫలమవుతున్నాయి. మున్సిపల్ ఎన్నికల ప్రచారం ఊపందుకుంటున్న వేళ... సగటు పట్టణ, నగర ఓటర్లు ఇలాంటి అంశాలన్నింటిపై లోతుగా ఆలోచించాలి. తమకు కావాల్సింది ఉపాధి రహిత అభివృద్ధా? చేతినిండా పని, కడుపునిండా తిండి పెట్టే అభివృద్ధా? ఏది ముఖ్యమనే విషయంపై వారు దృష్టి సారించాలి. గంజాయి, డ్రగ్స్ మాఫియా హైదరాబాద్ లాంటి కాస్మోపాలిటన్ నగరాన్ని దాటి మండల కేంద్రాలను కూడా అతలాకుతలం చేస్తున్న వేళ.. దాన్ని అరికట్టాలంటూ పాలకులను, ఓటు యాచకులను నిలదీయాలి. అందుకే ఇప్పుడు మున్సిపల్ ఎన్నికలు... పార్టీలతోపాటు ప్రజలకు అత్యంత కీలకం. రాబోయే తరాలకు దిశా నిర్దేశం.

# కేశవ్‌కు ఆర్థిక శాఖపైనే అవగాహన లేదు

(మొదటి తరువాయి)

కెమికల్స్ కలిపి ఆవు నెయ్యి కలిపారని చెప్పిన కేశవ్.. తక్కువ ధరలకు నెయ్యి కొన్నారు కాబట్టి అది కల్తీ నెయ్యి అంటున్నారన్నారు.. వారి ప్రభుత్వంలోనే హర్ష్ డెయిరీని ఇన్స్పెక్షన్ చేసి అన్నీ సంతృప్తికరంగా ఉన్నాయని అప్రూవ్ చేశారని ఆరోపించారు. అక్టోబర్ 2018 మాకేం సంబంధం.. ఫిబ్రవరి 2019 మాకేం సంబంధం అన్నారన్నారు.. మరి మే 2019 లో కేబినెట్ ఎలా పెట్టారు? అని ప్రశ్నించారు. మీ ఆపద్ధర్మ ప్రభుత్వంలో చాలా నిర్ణయాలు కూడా తీసుకున్నారు.. హర్ష్ ఫ్రెష్ డెయిరీ నుంచి 291 రూపాయలకు టీడీపీ కొనుగోలు చేసింది.. మరి ఇది భోలే బాబా డెయిరీ నే కదా? అని నిలదీశారు. 319, 329 తప్పన్నారు.. తాము రావటానికి రెండు నెలల ముందు 291కి వాళ్ళు ఎలా కొనుగోలు చేశారని చెప్పారు.. 2014- 19 మధ్య హర్ష్ ఫ్రెష్ డెయిరీ నుంచి కొన్నారు.. మీ ప్రభుత్వం సమయంలో మీ సొంత సంస్థ హెరిటేజ్ రేట్లు ఎలా ఉన్నాయో చెప్పే ధైర్యం మీకు ఉందా? అని మాజీ మంత్రి పేర్ని నాని నిలదీశారు. 'హెరిటేజ్ కంపెనీలో ప్రతీ ఆరు నెలలకు రేటు ఎలా ఉందో చెప్పండి.. ఎవరు అపచారం చేశారో.. ఎవరు హిందువో.. ఎవరు ఏంటో అర్థం అవుతుంది.. పవన్ ఉచ్ఛం.. నీచం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.. పవన్ కళ్యాణ్ ఎన్ని మతాలు మారారు.. తమ్ముడు కోటింగ్ ఇచ్చిన తర్వాత ఒక అన్నయ్య మాట్లాడారు.. సనాతన హిందువు అని చెప్పుకునే పవన్, నాగబాబుకు దేవుడంటే భయం లేదు.. భక్తి లేదు. జగన్ మీరు మా మతం జోలికి రావొద్దు అంటూ దిగజారి మాట్లాడారు.. మీ ప్రభుత్వం హాయంలో పెంటపాడులో తగలబడ్డ రథం ముద్దాయిని ఇప్పటి వరకు పట్టుకున్నారా? 250 ఆలయాలు ధ్వంసం చేశారని చంద్రబాబు మాట్లాడారు.. మీ హయంలో విజయవాడలో ఎన్ని ఆలయాలు ధ్వంసం చేశారు.. ఎంత నీచంగా ఆలయాలు, గర్భ గుడుల్లో విగ్రహాలు కూడా కూల్చివేశారు.. మీరు కూలదోసిన ప్రతీ ఆలయాన్ని పునః ప్రతిష్ట జేసింది జగన్ కాదా? పవన్ కళ్యాణ్ అయోధ్యకు యానిమల్ ఫ్యాట్‌తో తయారు చేసిన లక్ష లడ్డూలు సప్లై చేశారు.. దేశం మొత్తం తినిపించారు అని నీచంగా మాట్లాడారు.. పాలకమండలి సభ్యులు మహారాష్ట్రకు చెందిన సౌరభ్ గోరా, మైహోమ్స్ రామేశ్వరరావులు నెయ్యి వారే ఇచ్చి లడ్డూలు తయారు చేయించారు.. బూట్లు వేసుకుని దేవుడికి కొబ్బరి కాయలు కొట్టి, పూజలు చేసే చంద్రబాబు.. తల్లిదండ్రులు చనిపోతే జుట్టు కూడా ఇవ్వనివాడు హిందూ ధర్మాన్ని గౌరవించేవారు.. జగన్‌ను ప్రజల ద్వారా గెలవలేక నిందించటమే పనిగా పెట్టుకున్నారు.. రాజధానికి భూములు ఇచ్చిన రైతులను నానా ఇబ్బందులు పెడుతుంది ఎవరు.. రాజకీయాల్లో పతనానికి పరాకాష్టలా ఇవాళ చంద్రబాబు, పవన్ మాట్లాడిన మాటలు..' అని పేర్ని నాని వ్యాఖ్యానించారు.

# శ్రీవారికి చంద్రబాబు ఒక్కడే భక్తుడా

(మొదటి తరువాయి)

చంద్రబాబు, పవన్, బీజేపీ నేత మాధవ్ ప్రెస్ మీట్ ఉందన్నారు. తప్పులు చేసినందుకు చంద్రబాబు క్షమాపణలు చెప్పాలని జగన్ డిమాండ్ చేస్తే.. ఉలిక్కిపడి చంద్రబాబు ఈరోజు ముగ్గురు నేతలను తీసుకుని వచ్చారన్నారు. అవసరం అయితే గొడ్డు మాంసం తింటాను అని పవన్ కళ్యాణ్ చాలాసార్లు చెప్పారని ఆరోపించారు. చంద్రబాబుకు అమ్ముడుపోయి పవన్ కళ్యాణ్ ఇలా మాట్లాడారన్నారు. స్వామికి చంద్రబాబు ఒక్కడే భక్తుడా?.. ఇంకా ఎవరు లేరా? అని ప్రశ్నించారు చంద్రబాబు హయాంలోనే వేలాది ఆలయాలు కూల్చివేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తిరుమలలో మద్యం అమ్మారని.. బిర్యానీ తిన్నారన్నారు. తొక్కిసలాటలో ఆరుగురు చనిపోయారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే ఇలా ఎన్నో దారుణాలు జరిగాయని విమర్శించారు.. మంచి పనులే చేస్తే అలిపిరి దగ్గరే చంద్రబాబుపై బాంబు దాడి ఎందుకు జరిగింది? సిట్ రిపోర్టులో ఏముంది...జబ్బు పడినా ఆవులు, అనారోగ్యంతో ఉన్న ఆవుల వల్ల కూడా అలా జరుగుతుందని రిపోర్టులో ఉంది.సిట్ ఇచ్చిన చార్జ్ షీట్ గురించి ఇప్పటి వరకు మాట్లాడటం లేదు.. రిటన్ చేసినా నాలుగు ట్యాంకులను మళ్ళీ తిరుమల పంపించింది కూటమి ప్రభుత్వం. కొరియా నుంచి వచ్చిన కెమికల్స్ తెచ్చారంటూ కొత్త రాగం పాడుతున్నారు. సిట్ ఇచ్చిన రిపోర్టులో ఎక్కడ అనిమల్ ఫ్యాక్ట్ లేదని చెప్పారు. తన భాగస్వామ్య పార్టీలతో జగన్ పై కుట్రకు చేస్తున్నారు.. దీని వెనుక కుట్ర ఉంది అంటూ అబద్దాలు చెబుతున్నారు . ఏకసభ్య కమిషన్ వేసి మమ్మల్ని నేరస్థులుగా చేయాలనే ప్రయత్నం తప్ప ఎమిలేదు. అయోధ్యకు కూడా కల్తీ నెయ్యితో తయారు చేసినా లడ్డూలు పంపారని పవన్ కల్యాణ్ అబద్దాలు చెబుతున్నారు. చెప్పిన అబద్దాన్నే పదేపదే పవన్ కల్యాణ్ చెబుతున్నారు.. నిబంధనలు సడలించడం ద్వారా ఒక కొత్త కంపెనీ అయినా వచ్చిందా? దానికి చంద్రబాబు సమాధానం చెప్పాలి. ప్రీమియర్ డైరీ ద్వారా చంద్రబాబు హాయంలో రూ. 271కి నెయ్యి సరపరా చేశారు. ఇది పవన్ కల్యాణ్ తెలుసుకోవాలి.. గత ఐదేళ్ళ భక్తుల రద్దీ తగ్గిందని విచారణ చేయించి నిరూపించే దమ్ము చంద్రబాబుకు ఉందా? అని భూమన వ్యాఖ్యానించారు.
-

# ఐదేండ్లలో 18,727 ప్రభుత్వ బడులు మూత..

**న్యూఢిల్లీ:-ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**

భారత విద్యా వ్యవస్థ గణనీయమైన మార్పును ఎదుర్కొంటున్నది. ప్రభుత్వ పాఠశాలల సంఖ్య వేగంగా క్షీణిస్తుండగా అన్‌ఎయిడెడ్ ప్రైవేట్ స్కూళ్లు పెరిగిపోతున్నాయి. ఈ గణాంకాలను ప్రభుత్వం గురువారం రాజ్యసభ ముందు ఉంచింది. గత ఐదేండ్లలో దేశంలో 18,727 ప్రభుత్వ పాఠశాలలు మూతపడడంపై సీపీఎం ఎంపీ జాన్ బ్రిట్టాస్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిణామం ప్రభుత్వ విద్యా వ్యవస్థకు ప్రమాదకరమని ఎక్స్ పోస్టులో ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. దేశ ప్రజలకు ప్రత్యేకంగా గ్రామీణ, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు వెన్నెముక లాంటి ప్రభుత్వ విద్యా వ్యవస్థ క్రమంగా క్షీణించడం ఆందోళనకరమని ఆయన పేర్కొన్నారు. అదే సమయంలో ప్రత్యామ్నాయంగా ప్రైవేట్ స్కూళ్ల సంఖ్య పెరుగుతుండడాన్ని ఆయన ప్రస్తావించారు.




**సర్కారీ స్కూళ్ల మూత వెనుక?**

అధికారికంగా ప్రభుత్వం తెలిపిన గణాంకాల ప్రకారం 2020-21లో దేశంలో 10,32,049 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 2024-25లో ఆ సంఖ్య 10,13,322కి తగ్గిపోయింది. ఐదేండ్లలో మొత్తం 18,727 ప్రభుత్వ స్కూళ్లు మూతపడ్డాయి. ఇది అనేక రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ప్రభుత్వ విద్యా వ్యవస్థ పరిస్థితికి అద్దం పడుతుంది. హేతుబద్ధీకరణ, తక్కువ నమోదు ఉన్న పాఠశాలల విలీనం, జనాభా మార్పులు వంటి కారణాలు తరచుగా చెబుతున్నప్పటికీ క్షీణత స్థాయి ప్రభుత్వ విద్యా వ్యవస్థలో పెను నిర్మాణాత్మక మార్పులను సూచిస్తుంది.

**ప్రైవేట్ స్కూళ్ల విస్తరణ**

ప్రైవేట్ అన్‌ఎయిడెడ్ పాఠశాలల విస్తరణ ఇటీవలి కాలంగా గణనీయంగా కనపడుతున్నది. 2023-24లో 3,31,108 ప్రైవేట్ స్కూళ్లు ఉండగా 2024-25లో ఆ సంఖ్య 3,39,583కి పెరిగింది. అంటే కేవలం ఒక ఏడాదిలో 8,475 ప్రైవేట్ స్కూళ్లు అదనంగా వచ్చాయి. ఈ పెరుగుదల విద్యారంగంలో పెరుగుతున్న ప్రైవేట్ ఉనికిని సూచిస్తుంది. తల్లిదండ్రులు, విద్యార్థుల్లో కూడా ప్రైవేట్ పాఠశాలల పట్ల పెరుగుతున్న మోజును తెలియజేస్తుంది.


# ట్రేడ్ డీల్‌పై నాలుగైదు రోజుల్లో ఉమ్మడి ప్రకటన: గోయల్



**న్యూఢిల్లీ:ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**

భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంలో మొదటి విడత ఉమ్మడి ప్రకటనను నాలుగైదు రోజుల్లో ఖరారు చేసి సంతకం చేసే అవకాశం ఉందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖల మంత్రి పీయూష్ గోయల్ గురువారం తెలిపారు. ఈ సంతకాలు జరిగాక భారత్‌పై సుంకాలను 18 శాతానికి తగ్గించే కార్యనిర్వాహక ఉత్తర్వును అమెరికా ప్రభుత్వం జారీ చేస్తుందని ఆయన వెల్లడించారు.

# భారతీయ టీచర్‌కు గ్లోబల్ టీచర్ ప్రైజ్



**న్యూఢిల్లీ ,ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**

భారత్‌లో పేద బస్తీల్లో గోడలనే తరగతి గదులుగా మార్చిన 'రూబుల్ నాగి' 'గ్లోబల్ టీచర్ ప్రైజ్' అందుకున్నారు. గురువారం దుబాయ్‌లో నిర్వహించిన వరల్డ్ గవర్నమెంట్స్ సమ్మిట్ వేదికగా పురస్కారాన్ని ప్రదానం చేశారు. అవార్డుతోపాటు మిలియన్ డాలర్లు (సుమారుగా రూ.9 కోట్లు) నగదు ఆమెకు బహుమతిగా దక్కింది.సామాజిక కార్యకర్తగా, విద్యావేత్తగా ఆమె చేసిన సేవలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రశంసలు దక్కాయి. రూబుల్ నాగి తాను స్థాపించిన ఫౌండేషన్ ద్వారా దేశంలోని వెనుకబడిన వర్గాల పిల్లల కోసం ఇప్పటివరకు 800కుపైగా లెర్నింగ్ సెంటర్లు ఏర్పాటుచేశారు.

# బోయింగ్ డిఫెన్స్ విభాగంలో 300 ఉద్యోగాలకు కోత

**న్యూఢిల్లీ: ,ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**

అమెరికాకు చెందిన విమాన తయారీ సంస్థ 'బోయింగ్' తన డిఫెన్స్ విభాగంలో పెద్ద ఎత్తున ఉద్యోగాల కోతను చేపట్టింది. సైప్లె చైన్‌లో పనిచేస్తున్న దాదాపు 300 మందిని విధుల నుంచి తొలగిస్తున్నది.ఎంతమందిపై దీని ప్రభావముంది, ఎవరెవరు ఉద్యోగాలు కోల్పోయారన్న విషయాలు మరికొద్ది రోజుల్లో బయటకు రానున్నట్టు ఈ అంశంతో సంబంధమున్న ఓ వ్యక్తి మీడియాకు తెలిపారు.



# అధికారంలో నరరూప రాక్షసుడు..
# ప్రతిపక్షంలో అమాయకుడు..

**- అతనే సైకో రెడ్డి..**
**- తాతంశెట్టి నాగేంద్ర విమర్శ**




**రైల్వే కోడూరు ప్రతినిధి (డ్రీమ్ టైమ్స్) ఫిబ్రవరి 5:** అధికారంలో నరరూప రాక్షసుడు.. ప్రతిపక్షంలో అమాయకుడు.. అతననే సైకో లెవెల్ మోహన రెడ్డి జనసేన రాష్ట్ర కార్యదర్శి నాగేంద్ర విమర్శించారు. గురువారం సాయంత్రం ఆయన జనసేన కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమాలతో కూడిన పరిపాలన నడుస్తుంటే ఓరువలేక గతంలో తాము చేసిన ఘోరాలు బయటకు వస్తుంటే జగన్ భయపడి తప్పుడు రాజకీయాలకు సిద్ధపడ్డాడన్నారు. తిరుమల లడ్డులు కల్తీ నెయ్యి వాడారు అనేది ముమ్మాటికి సీట్ నివేదిక స్పష్టంగా చెబుతున్నా ఇంకా బుకాయిస్తున్నారన్నారు. విచారణలో కూడా కల్తీ నెయ్యి వాడారు అని తేలిందన్నారు. ప్రభుత్వం కచ్చితంగా దోలనుషులను చట్టం ముందు నిలబెడుతుందని చెప్పారు. దాన్ని డైవర్ట్ చేసేందుకే అంబటి రాంబాబును జగన్ ఒక పావుగా వాడుకున్నా రన్నారు. సిబిఐ ఎక్కడ క్లీన్ చిట్ ఇచ్చిందో చూపించాలని, ఆ నివేదిక చూస్తే జనం మీ చెంపలు వాయగొడతారని వివరించారు. ప్రజలకు వాస్తవాలు తెలియజేసాలా ఒక ఫ్లెక్స్ వేయగానే గగ్గోలు పెడుతున్నారన్నారు. అంటే వీళ్లకు భయం ఏ స్థాయిలో పుట్టిందో జనానికి అర్థం అయింది అని చెప్పారు. నాగేంద్ర ప్రెస్ మీట్ లో ఇంకా తన మాటల్లో.. ఫ్లెక్సీ వేస్తే గోల చేస్తున్న జగన్ వైసిపి సిద్ధం సభలో చంద్రబాబు పవన్ కళ్యాణ్ పోలిన బొమ్మలు పెట్టి వాటిని వైసిపి గంజాయి బ్యాచ్తో కొట్టించి కాళ్లతో తన్నించనప్పుడు ఏమైంది? ఈ సంస్కారం మీ విలువలు అప్పుడు రాక్షస నందం పొందింది జగన్ కాదా అని అడుగుతున్నా ము. ఆ ఫ్లెక్సీలో వాస్తవాలు ప్రజలకు చెప్పేలా ఉండటంతో జగన్ అర్జెంటుగా సంస్కారం గుర్తుకు వచ్చింది. అంబటి రాంబాబు తిట్టినవి తిట్లే కాదు అవి బూతులే కాదు అంటూ జగన్ సర్టిఫికెట్ ఇస్తున్నాడు అంటే అతను మానసికంగా ఎంత దిగజారిపోయాడో తెలుస్తుంది లండన్ మందులు కూడా పనిచేయడం లేదు. అని వివరించారు. కార్యక్రమంలో మాదాసు నరసింహ షేక్ రియాజ్ ,మద్దూరి మన్మధ ,నారకట్ల గంగయ్య , మాదాసు శివ, పెద్దం గారి సాయి, కొనిశెట్టి చక్రి, దాది రామచంద్ర , మహంకాళి నాగేంద్ర ,తమ్మిశెట్టి వెంకటేష్ ,మాదినేని రాజా, గంధం శెట్టి వెంకటేష్, కోలా మని , మోదిగల రామయ్య, ప్రణీత్ గౌడ్ మరియు జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మోటర్ సైకిల్ చోరి కేసులో నిందితుడి అరెస్టు




**నంద్యాల ప్రతినిధి, ఫిబ్రవరి 5(డ్రీమ్ టైమ్స్):** నంద్యాల పట్టణ పరిధిలోని చెరువు కట్ట సమీపంలో గురువారం వాహనాల తనిఖీ చేస్తుండగా వివిధ మోటర్ సైకిళ్ల చోరీ కేసుల్లో నిందితుడు మహమ్మద్ వలిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. నిందితుడి నుంచి స్కూటీతో పాటు మరో మూడు మోటర్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఎం. జావళి పర్యవేక్షణలో ఒకటో పట్టణ సీఐ సుధాకర్ రెడ్డి, సీసీఎస్ సీఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు నమోదైన వారం రోజుల్లో కేసును ఛేదించి నిందితుడితో పాటు నాలుగు మోటర్ సైకిళ్లను రికవరీ చేయడంపై జిల్లా ఎస్పీ సునీల్ షోరాణ్ అభినందించారు. స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సీఐ సుధాకర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. కర్నూలు పట్టణానికి చెందిన దమామ్ నరసప్ప అనే వ్యక్తి గత జనవరి 25వ తేదీన నంద్యాల బస్టాండులో మోటర్ సైకిల్ పార్కింగ్ చేసి బస్సు సమాచారం వివరాలు తెలుసుకునేందుకు వెళ్లాడని, వెంటనే తిరిగి వచ్చి చూసుకునేలోగా మోటర్ సైకిల్ కనిపించక పోవడంతో ఫిర్యాదు చేసినట్లు సీఐ తెలిపారు. రాబడిన సమాచారం మేరకు నంద్యాల చెరువు వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. నిందితుడు మహమ్మద్ వలి ఉరఫ్ వలి నంద్యాల పట్టణానికి చెందిన వాడని, ఇతడిపై కర్నూలు, ఓర్వకల్లు, ఆత్మకూరు, బేతంచర్ల, నంద్యాల తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో 9 కేసులు నమోదైనట్లు తెలిపారు. నిందితుడు నుంచి స్కూటీతో పాటు మరో మూడు మోటర్ సైకిళ్లను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు తమ వాహనాలను సురక్షితంగా ఉంచుకోవాలని, అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

# చెన్నూరులో దోమల బెడద నివారణకు ఊరంతా ఫాగింగ్.



**శిరివెళ్ళ.( డ్రీమ్ టైమ్స్ న్యూస్)** మండల పరిధిలోని చెన్నూరు గ్రామంలో ఊరంతా ఫాగింగ్ మిషన్ తో దోమల బెడద నివారణకు తగిన చర్యలు తీసుకున్నట్లు గ్రామపంచాయతీ సెక్రటరీ రఘు మరియు సర్పంచ్ బుచ్చిబాబు మెరువ నాగభూషణం రెడ్డి పేర్కొన్నారు.గ్రామ సమీపంలో పంట పొలాలు వాగులు కాలువలలో తెలుగు గంగ నీరు ఉండడం వల్ల చెన్నూరు గ్రామంలో దోమలు ఉధృతి అధికంగా ఉన్నదని గ్రామస్తులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేశారు. వెంటనే స్పందించిన సర్పంచ్ మరియు నాగభూషణం రెడ్డి గ్రామపంచాయతీ అధికారుల సమక్షంలో దోమల నివారణకు ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలియజేశారు.పెరుగుతున్న దోమల ఉధృతిని తగ్గించి, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు.చెన్నూరు గ్రామంలో జరుగుతున్న ఫాగింగ్ పనులను స్వయంగా పాల్గొని పర్యవేక్షించారు.గ్రామంలోని ప్రతి వీధిలో ప్రతి మురుగు నీటి కాలువల వద్ద తీసుకున్న ఫాగింగ్ చర్య పట్ల హర్షం వ్యక్తం చేశారు.

# గుండాల కోన పరిసర ప్రాంతాల పరిశీలన చేసిన సీఐ శ్రీనివాసులు



**రైల్వే కోడూరు ప్రతినిధి ఫిబ్రవరి 5 (డ్రీమ్ టైమ్స్):** చిట్వేల్ మండల పరిధిలోని పెద్దూరు గ్రామం నుంచి సుమారు 8 కిలోమీటర్ల దూరంలో వెలసిన ప్రసిద్ధ గుండాల కోన కర్మాటేశ్వర స్వామి ఆలయాన్ని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల నేపథ్యంలో రైల్వే కోడూరు రూరల్ సీఐ శ్రీనివాసులు పరిశీలించారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి, చిట్వేల్ ఎస్సై వినోద్ కుమార్తో కలసి ఆలయ పరిసర ప్రాంతాలను జల్లెడ పట్టారు.
ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చేపట్టాల్సిన ఏర్పాట్లు, భద్రతా చర్యలపై సవివరంగా సమీక్షించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొంగటవల రాజశేఖర్ నాయుడు తో కలిసి ఆలయ పరిసరాలు, రహదారులు, పార్కింగ్, భద్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని గుండాల కోనకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు, ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు పోలీసులు తెలిపారు.

# ఘనంగా శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం 18వ వార్షికోత్సవం



**కరీంనగర్,ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్** కిసాన్ నగర్లోని శ్రీ లక్ష్మీ గణపతి దేవస్థానం 18వ వార్షికోత్సవ దినోత్సవం వైభవంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకులు వాసాలమర్రి మహేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా 108 కలశాలతో పాటు 108 దంపతులచే మహా కుంభాభిషేకం నిర్వహించబడింది. అనంతరం స్వామివారి అలంకరణ, లక్ష్మీ గణపతి హోమం, పంచామృతాభిషేకం నిర్వహించారు.తరువాత మంగళహారతి, తీర్థప్రసాదం, అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు జరిగాయి.ఈ వేడుకలో ఆలయ కమిటీ సభ్యులు పెద్ది చంద్రమౌళి, గంజి రఘు, ఎలుగూరి ప్రసాద్, దొంతుల మనోహర్, బడిమెల రామ్మోహన్, కైలాస హరీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉరుసు సందర్భంగా ముమ్మరంగా
# పారిశుద్ధ్యం పనులు.



**శిరివెళ్ళ.( డ్రీమ్ టైమ్స్ న్యూస్)** మండల కేంద్రంలోని శిరివెళ్ల మేజర్ గ్రామ పంచాయతీలో గల పాత శిరివెళ్ల ఏరియాలో ఉన్నటువంటిహజరత్ సయ్యద్ షానేశా ఉరుసు సందర్భంగా గ్రామపంచాయతీ తరపున ముమ్మరంగా పారిశుద్ధ్యం పనులు నిర్వహించినట్లు డిప్యూటీ ఎంపీడీఓ శిరివెళ్ల మేజర్ పంచాయతీ ఈవో అశ్విన్ కుమార్ పేర్కొన్నారు. 5, 6, 7,తేదీలలో 3 రోజుల పాటు జరగనున్న ఉరుసు మహోత్సవాలను దృష్టిలో పెట్టుకొని వందలాదిగా భక్తులు పాల్గొంటారని అంటు వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అక్కడ ఉన్న చెత్తాచెదారం పిచ్చి మొక్కలను తొలగించి పరిసరాల పరిశుభ్రతకు కృషిచేసి బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేసినట్లు తెలియజేశారు. 5న గంధం 6న ఉరుసు 7 జారతలు నిర్వహిస్తున్నందున తరలివచ్చే భక్తులు కళాకారులు బొమ్మల దుకాణం వ్యాపారులు ప్రతి ఒక్కరు దర్గా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓ అశ్విని కుమార్ సూచించారు.

# సంత్ రవిదాస్ 649 జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించిన బిజెపి నాయకులు వర్మ.



**రైల్వే కోడూరు ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్** రైల్వే కోడూరు పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఉన్న మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన పెద్దలను అన్నమయ్య జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు డి. జయప్రకాష్ నారాయణ వర్మ గురువారముసన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్మరణీయులు సంత్ రవిదాస్ గారి 649 వ జయంతి ఉత్సవాలలో భాగంగా ఈరోజు రైల్వే కోడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సర్కిల్ వద్ద గల చర్మకార వృత్తి నిర్వహిస్తున్న మాదిగ సామాజిక వర్గానికి సంబంధించిన పెద్దలను, మరియు నాయకులను ఘనంగా సన్మానించడం శుభ పరిమాణం అన్నారు.
ఈ కార్యక్రమం రాష్ట్ర రాజ మోర్చా ఈటమార్పురం సుబ్రహ్మణ్యం , రాష్ట్ర కిసాన్ మోర్చా హార్టికల్చర్ మాజీ కన్వీనర్ తోట శ్రీనివాసులు , కోడూరు మండల అధ్యక్షులు సాయం శ్రీధర్, సాయి ఆచారి, అందరివాడు సుబ్బారావుతదితరులు పాల్గొన్నారు.


# అంగన్వాడీ విద్యార్థులకు పలకలు పంపిణీ



**బనగానపల్లె , ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్** పట్టణంలోని భానుముక్కల 2, 7 అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న విద్యార్థులకు దూదేకుల రాజు పలకలు, పెన్సిల్లు, బలపాలను పంపిణీ చేశారు. గురువారం భానుముక్కల లోని అంగన్వాడీ కేంద్రం-2 లో 16 మందికి, అంగన్వాడి కేంద్రం -7 లో 15 మంది విద్యార్థులకు దూదేకుల రాజు పలకలు, బలపాలు, పెన్సిల్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి వర్కర్ ఎన్. మల్లేశ్వరి, వరలక్ష్మి పాల్గొన్నారు

# పేరు మారినా... పేదల కష్టం మారదు

**జాతీయ ఉపాధి హామీ పథకం పేరు మార్పు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి : సిపిఎం**




**తనకల్లు ఫిబ్రవరి 5 డ్రీమ్ టైమ్స్ న్యూస్.**
మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకాన్ని పేరు మార్చి బిజెపి ప్రభుత్వం పేదల కడుపు కొట్టే విధంగా వ్యవహరిస్తుందని మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అనే పేరును తొలగించి జి రామ్ జి అనే పేరుతో తీసుకొచ్చిన కొత్త పథకాన్ని ఉపసంహరించుకోవాలని తనకల్లు మండలంలోని సిపిఎం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం అనే పేరు కరెక్ట్ గా ఉందని ఈ పేరును మార్చడంలో పెద్దగా ప్రయోజనం లేదని, పేరు మారిన పేదల కష్టం మారదు కనుక ఉపాధి హామీపై రాజకీయాలు చేయకుండా పథకం అమలుపై దృష్టి పెట్టి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం పేరుతోనే కొనసాగిస్తూ పార్లమెంటులో చట్టం చేయాలని, అదేవిధంగా ఉపాధి హామీ పని దినాలు 200 రోజులకు పెంచి, రోజుకు 600 రూపాయలు కూలీ ఇవ్వాలని లేని పక్షంలో దశలవారీగా, జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని తెలియజేస్తూ తనకల్లు మండలంలో సిపిఎం నాయకులు కలిసి ఈ సందర్భంగా మండల తహశీల్దార్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు శివన్న, శ్రీనివాసులు, నారాయణప్ప, ప్రసాద్, నరసింహులు, రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

# ఆశాలకు అన్ని సంక్షేమ పథకాలు అందాలి



**పత్తికొండ ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
పత్తికొండ మండలం పుచ్చకాయల మాడ గ్రామం నందు కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ముందు ఆశ వర్కర్ల సమావేశం నిర్వహించి 12న జరిగే సార్వత్రిక సమ్మె నోటీసును డాక్టర్ రాఘవ నాయుడుకు అందించారు. ఈ సమావేశానికి ఆశా వర్కర్ల యూనియన్ మండల నాయకురాలు స్వాతి,అధ్యక్షతన వహించారు.ముఖ్య అతిథులుగా హాజరైన సిఐటియు మండల కార్యదర్శి ఎం. రవిచంద్ర,ఈ సమావేశాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ఈనెల 12న జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెలో ఆశా కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఆశా కార్మికులను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని 26వేల రూపాయలు కనీస వేతనం ఇవ్వాలని ఆశల నియామకాన్ని ప్రభుత్వమే నిర్వహించాలని ఆరోగ్య రంగానికి జిడిపి లో 6% నిధులు కేటాయించాలిని కమ్యూనిటీ హెల్త్ వర్కర్స్ ని ఆశాలుగా మార్చాలని. సమాన వేతనం,ఇతరసౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీ కరణ, అమ్మకాన్ని ఆపాలని. ప్రజా సంపదను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు.లేబర్ కోడ్స్ రద్దుచేయాలని.కార్మిక చట్టాలను పటిష్ట పరిచి 29 చట్టాలను పునరుద్ధరించాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీ కేశమ్మ,నాగవేణి, కొండమ్మ,రంగమ్మ,పుష్ప,వెంకటలక్ష్మి, సునీత,తదితరులు పాల్గొన్నారు.

# చింతకుంటకు చేరుకున్న అహోబిలేసుడు



**ఆళ్లగడ్డ ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద చింతకుంటకు అహోబిలేసుడి ఉత్సవ పల్లకి గురువారం చేరుకుంది. ఉయ్యాలవాడ మండలం సర్వేపల్లి గ్రామం నుంచి వేకువజామున ఆళ్లగడ్డ ఎంపీడీవో కార్యాలయం, ఫైర్ స్టేషన్, డీఎస్పీ కార్యాలయం వద్ద పూజలు అందుకొని అనంతరం చింతకుంటకు చేరుకుంది. గ్రామానికి చేరుకున్న వెంటనే గ్రామస్థులు వీఆర్వో మేళ తాళాలతో ఎదురుగా ఘనంగా స్వాగతం పలికారు. గ్రామంలో తిరునాళ్ల వాతావరణం నెలకొంది.

# హజ్ యాత్ర విజయవంతం కోసం కార్యాచరణ

**-రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**
**-హజ్ యాత్ర- 2026 ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష**




**విజయవాడ, ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
పవిత్ర హజ్ యాత్ర కు వెళ్లే భక్తులందరికీ సకల సౌకర్యాలు కల్పించడం కోసం ప్రత్యేకంగా అన్ని చర్యలు చేపట్టేందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడించారు. గురువారం హజ్ యాత్ర -2026 ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. విజయవాడ నగరంలోని లబ్బీపేట పద్మశాలీయ కళ్యాణమండపంలో ఏర్పాటు చేసిన సమీక్షకు మైనారిటీ మంత్రి ఫరూక్ హాజరయ్యారు. రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ షేక్ హసన్ బాషా, సభ్యులు, ఉర్దూ అకాడమీ చైర్మన్ మహమ్మద్ ఫారూక్ షుబ్లీ, రాష్ట్రంలోని అన్ని జిల్లాల హజ్ సొసైటీలు, హజ్ యాత్ర ఇన్ స్పెక్టర్లు, శిక్షకులు, తదితరులతో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ ఏపీ నుంచి హజ్ యాత్రకు వెళ్లే వారందరికీ యాత్ర విజయవంతం కోసం, ఎలాంటి ఇబ్బందులు లేకుండా, రవాణా, వసతి , భద్రత తదితర ఏర్పాట్లపై ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించిందని అన్నారు. జిల్లాల వారీగా ఉన్న హజ్ సొసైటీలు తమ తమ పరిధిలో హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్, యాత్రలో అవలంబించవలసిన విషయాలపై కూలంకషంగా వివరించేందుకు ప్రత్యేకంగా సమావేశాలు నిర్వహించాలని సూచించారు. ఇమిగ్రేషన్, మక్కాయాత్రలో అక్కడి వసతుల సౌకర్యాలు తదితర ఏర్పాట్లపై గత ఏడాది తరహాలోనే ఇన్ స్పెక్టర్లు దగ్గరుండి చూసుకోవాలని ఆదేశించారు.

**విజయవాడ ఎంబార్కెషన్ పాయింట్ నుంచి వెళ్లే వారందరికీ రూ.లక్ష ఆర్థిక సాయం**

విజయవాడ ఎంబార్కేషన్ పాయింట్ నుండి పవిత్రమైన మక్కా హజ్ యాత్ర కు వెళ్లే ప్రయాణికులకు సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అందించే ఒక లక్ష రూపాయల ఆర్థిక చేయూతను సద్వినియోగం చేసుకోవాలని రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కోరారు. గన్నవరం ఎయిర్పోర్ట్ నుండి హజ్ కు వెళ్లే వారందరికీ రూ. లక్ష ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ఇప్పటికే ఉత్తర్వులు మంజూరు చేసిందనే విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. ఆదాయం తో నిమిత్తం లేకుండా విజయవాడ ఎంబార్కేషన్ నుంచి వెళ్లే యాత్రికులందరికీ మైనారిటీ సంక్షేమ శాఖ రూ.లక్ష సాయం అందిస్తుందన్నారు. ఇతర రాష్ట్రాల ఎంబార్కేషన్ కేంద్రాల నుండి వెళ్లే యాత్రికుల విమాన చార్జీల కంటే ఎక్కువ మొత్తం విజయవాడ నుంచి వెళ్లే వారిపై పడుతున్న భారం తగ్గించేందుకు రూ. లక్ష ఆర్థిక సహాయం అందించడం జరుగుతుందన్నారు. గన్నవరం విమానాశ్రయం పరిసర జిల్లాల యాత్రికుల సౌకర్యార్థం, ఏపీ రాజధానిగా అమరావతి ప్రాముఖ్యతను మరింత పెంచేందుకు, విజయవాడ నుండి హజ్ కి వెళ్లే యాత్రికులందరికీ ప్రభుత్వం రూ.లక్ష ఆర్థిక సాయం అందిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రం నుండి హజ్ కి వెళ్లే వారంతా ఇకముందు విజయవాడ ఎంబార్కేషన్ కేంద్రాన్ని ప్రథమ ప్రాధాన్యతగా ఎంచుకుని కూటమి ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయంను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ మంత్రి ఎన్ఎండి ఫరూక్ పిలుపునిచ్చారు. ప్రత్యేక సమీక్షా సమావేశంలో హజ్ కమిటీ సీఈవో గౌస్ పీర్, సిబ్బంది పాల్గొన్నారు.

# మిన్నంటిన 'మస్తానయ్య స్వామి'ఉరుసు సంబరాలు

**పత్తికొండ,ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
మండల పరిధిలోని నలకదొడ్డి గ్రామంలో వెలసిన భక్తుల ఇలవేల్పు శ్రీశ్రీ మస్తానయ్య స్వామి ఉరుసు మహోత్సవం గురువారం గ్రామ పెద్దలు, భక్తుల సమక్షంలో అత్యంత వైభవంగా జరిగింది. కులమతాలకు అతీతంగా సాగిన ఈ వేడుకల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.తలచిన వారికి ఇలవేల్పుగా..కొలిచిన వారికి కొంగుబంగారంగా విరాజిల్లుతున్న మస్తానయ్య స్వామి వారిపై గ్రామస్తులకు అచంచలమైన నమ్మకం.ఈ క్రమంలోనే ఉరుసు జియారత్ సందర్భంగా భక్తులు గురువారం తెల్లవారుజాము నుండే ఆలయానికి పోటెత్తారు.మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య స్వామివారికి పూలచాదర్లు సమర్పించి,ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.తమ కోర్కెలు తీర్చాలని కోరుకుంటూ భక్తులు సమర్పించిన మొక్కులతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను



సంతరించుకున్నాయి. స్వామివారిపై భక్తులు చూపే భక్తికి నిదర్శనంగా ఈ ఏడాది భారీగా కానుకలు లభించాయి.భక్తులు వెండి,బంగారం మరియు నగదు రూపంలో మొక్కులు చెల్లించుకోగా మొత్తం రూ 5,70,000 ల.వేలు..కానుకల రూపంలో ఆదాయం వచ్చినట్లు ఆలయ కమిటీ సభ్యులు వెల్లడించారు.ఈ నిధులను ఆలయ తదుపరి అభివృద్ధి కార్యక్రమాలకు వినియోగించనున్నట్లు వారు తెలిపారు. ఈ ఉత్సవంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి బత్తిన లోకనాథ్, నలక దొడ్డి టీడీపీ గ్రామ అధ్యక్షుడు బత్తిని రాజశేఖర్, పాల్గొని స్వామివారికి ప్రత్యేక ప్రార్థనలు చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఇటువంటి ఆధ్యాత్మిక వేడుకలు గ్రామంలో సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తాయని కొనియాడారు. గ్రామ పెద్దలు, భక్తులు మరియు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఉరుసును పురస్కరించుకొని గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా నిర్వాహకులు అన్నదాన ప్రసాద వితరణ మరియు త్రాగునీటి సౌకర్యాలను కల్పించారు.

# కుష్టి వ్యాధి నివారణకు సహకరించండి...




**ఓర్వకల్ ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
మండలంల పరిధిలోని ఎన్. కొంతలపాడు గ్రామంలో ఎంపీపీ స్కూల్ నందు గురువారం కుష్టి వ్యాధి పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హుసేనాపురం పిహెచ్సి హాస్పిటల్ సూపర్వైజర్ ప్రకాష్ హెల్త్ సెంటర్ రాజేంద్ర ఎంపీపీ స్కూల్ హెడ్మాస్టర్ నాగరాజు ఏఎన్ఎం ప్రేమలత ఆశా వర్కర్ సలోమి , స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు హుసేనాపురం పిహెచ్సి హెల్త్ సెంటర్ సూపర్వైజర్ ప్రకాష్ మాట్లాడుతూ కుష్టి వ్యాధి మైకో బ్యాక్టీరియామ్ లేప్రే అనే సూక్ష్మ క్రిమి వలన వస్తుంది. చికిత్స పొందిన వ్యాధిగ్రస్తుల నుండి గాలి. తుంపర్ల ద్వారా ఇతరులకు సోకుతుంది. అన్ని ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాలలో వ్యాధి నిర్ధారణ. సలహా మరియు చికిత్స ఉచితం. ఎమ్. డి. టి. మందుల ద్వారా ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు. చికిత్స కాలం 6 నుండి 12 నెలలు. మందులు పూర్తిగా ఉచితం ప్రతి గవర్నమెంట్ హాస్పిటల్ లో దొరుకుతాయి. వ్యాధి తొలి దశలోనే చికిత్స తీసుకుంటే వ్యాధి వ్యాప్తి అరికట్టడమే కాకుండా అంగవైకల్యాన్ని నివారించవచ్చును. అని స్కూల్ విద్యార్థులకు సూచనలు ఇవ్వడం జరిగింది.

# అంగన్వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకోండి

**-- సర్పంచ్ రమాదేవి**



**ఎలిగేడు,ఫిబ్రవరి 5 డ్రీమ్స్ టైమ్స్**
అంగన్వాడీ కేంద్రాలలో చిన్నారులు, గర్భిణీలు, బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం అందిస్తుందని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మద్దెల రమాదేవి-సంపత్ సూచించారు.ర్యాకల్దేవుపల్లి అంగన్వాడీ కేంద్రంలో ఏఎల్ఎంసీ స్థాయి మానిటరింగ్ కమిటీ ఏర్పాటు కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పిల్లల పోషణ, ఆరోగ్యం, మహిళ సంక్షేమం వంటి అంశాలపై చర్చించారు. అంగన్వాడీ సేవలను సమర్థవంతంగా అమలు చేయడంలో కమిటీ సమావేశాలు కీలకమని ఆమె పేర్కొన్నారు.కార్యక్రమంలో ఉపసర్పంచ్ బొడిగె శివకృష్ణగౌడ్, పంచాయతీ కార్యదర్శి హరిబాబు, అంగన్వాడీ టీచర్ ఓదెశ్వరి, గర్భిణీలు, బాలింతలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బిజినెస్

## కుప్పకూలుతున్న బిట్‌కాయిన్ ధర!

*తలలు పట్టుకుంటున్న క్రిప్టో ఇన్వెస్టర్లు.. రానున్న రోజుల్లో..*



బిట్‌కాయిన్ ధర గురువారం 69,000 డాలర్లకి పడిపోయింది. ఈ క్షీణత మరింత తీవ్రమవుతుందని, బిట్‌కాయిన్ 38,000 డాలర్లకి కూడా పడిపోవచ్చని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. బిట్‌కాయిన్ చుట్టూ ఉన్న సెంటిమెంట్ మరింత ప్రతికూలంగా మారుతోంది. ప్రస్తుత అమ్మకాలు ఎక్కడ ముగుస్తాయో నిపుణులు గుర్తించడానికి ప్రయత్నిస్తున్నారు. ఇంతలో ప్రఖ్యాత అమెరికన్ ఆర్థిక సేవల సంస్థ స్టిఫెల్, బిట్‌కాయిన్ మరింత క్షీణించే అవకాశం ఉందని హెచ్చరించింది. బారీ బి బన్నిస్టర్ నేతృత్వంలోని బృందం క్లయింట్‌లకు ఇచ్చిన నోట్‌లో బిట్‌కాయిన్ ఇప్పటికే గరిష్ట స్థాయి నుండి 41 శాతం తగ్గింది. చారిత్రక ధోరణుల ఆధారంగా తదుపరి కనిష్ట స్థాయి దాదాపు 38,000 డాలర్లు కావచ్చునని చెప్పారు. విశ్లేషకులు గతంలో జరిగిన బిట్‌కాయిన్ క్రాష్‌లను కూడా ఉదహరించారు. బిట్‌కాయిన్ 2011లో 93 శాతం, 2015లో 84 శాతం, 2018లో 83 శాతం, 2022లో దాదాపు 76 శాతం పడిపోయింది. ఈ గణాంకాలను కలిపితే ప్రస్తుత క్షీణత తదుపరి దశ దాదాపు 38,000 డాలర్లుగా కనిపిస్తోందని అంటున్నారు. అక్టోబర్‌లో 126,000 డాలర్లకు చేరుకున్న తర్వాత, బిట్‌కాయిన్ ఇప్పుడు బాగా పడిపోయింది. గురువారం ఇది 69,333 డాలర్లకు పడిపోయింది, ఇది నవంబర్ 2024 తర్వాత దాని కనిష్ట స్థాయి. బిట్‌కాయిన్ మారుతున్న ప్రవర్తనను వివరించడానికి స్టిఫెల్ బృందం "ది క్యూరియస్ కేస్ ఆఫ్ బెంజమిన్ బటన్" చిత్రాన్ని ఉదహరించింది. గతంలో డాలర్ బలహీనపడినప్పుడు బిట్‌కాయిన్ బలపడేది, కానీ ఇప్పుడు ఈ పద్ధతి మారిపోయింది. బిట్‌కాయిన్ ఇప్పుడు నాస్‌డాక్ 100, గ్రోత్ స్టాక్‌లతో మరింత దగ్గరి సంబంధం కలిగి ఉంది. ఫెడ్ దుష్ట వైఖరిని చూపినప్పుడు బిట్‌కాయిన్ పెరుగుతుంది, అది బిగించే వైఖరిని సూచించినప్పుడు పడిపోతుంది. టెక్ కంపెనీలకు రుణ వ్యయాలు పెరగడం, స్టాక్ మార్కెట్‌లో ఒత్తిడి బిట్‌కాయిన్ ధరలను మరింత తగ్గించవచ్చని విశ్లేషకులు అంటున్నారు.

## భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు




బంగారం ధరల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ధరలు ఎప్పుడు పెరుగుతాయో ఎప్పుడు తగ్గుతాయో పసిడి ప్రియులకు అంతు చిక్కడం లేదు. ఒకరోజు పెరిగితో మర్నాడు భారీగా తగ్గుతున్నాయి. ఈ నేపథ్యంలో కొనుగోలు దారులు అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు.జనవరి నెలలో పసిడి ధరలు పెరగడమే కాని తగ్గడం జరగలేదు. ఇక ఫిబ్రవరి వచ్చేసరికి బంగారం ధరలు ఒకరోజు పెరిగితే మరొక రోజు తగ్గుతూ ఊగిసలాట మధ్య కదలాడుతున్నాయి. ఇక ఫిబ్రవరి 5 గురువారం పసిడి ధరల విషయానికి వస్తే బంగారం ధరలు భారీగానే తగ్గుముఖం పట్టాయి. ఈ రోజు 24 క్యారెట్ల బంగారంపై రూ.5,020 తగ్గి 10 గ్రాములు ధర రూ.1,54,420లు పలుకుతోంది. 22 క్యారెట్ల బంగారంపై రూ.4,600 లు తగ్గి రూ.1,41,550లు పలుకుతోంది. వెండి కిలోపై రూ.20,000 తగ్గి రూ.3,00,000లు పలుకుతోంది. దేశంలోని వివిధ నగరాల్లో గురువారం బంగారం వెండి ధరలు ఎలా ఉన్నాయంటే.. ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ. 1,54,570 వద్ద కొనసాగుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,41,700 గా కొనసాగుతోంది. ముంబై, కోల్‌కతా లో 24 క్యారెట్ల బంగారంపై రూ.6,600 తగ్గి రూ.1,60,530, 22 క్యారెట్ల బంగారంపై రూ. 6,050లు తగ్గి రూ.1,47,150 లు గా కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,56,220 వద్ద ట్రేడవుతుండగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం రూ.1,43,200 గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల పది గ్రాముల బంగారం ధర రూ.1,54,420 ఉంటే.. 22 క్యారెట్ల 10గ్రాముల బంగారం ధర రూ.1,41,550 పలుకుతోంది. కిలో వెండి పై రూ.20,000 తగ్గి రూ.3,00,000 పలుకుతోంది. ఈ ధరలు పెరగవచ్చు, తగ్గవచ్చు. బంగారం కొనడానికి వెళ్లేముందు మరోసారి ధరలు చెక్‌చేసుకుంటే మంచిది.

## లాభాల స్వీకరణ.. నష్టాల్లో దేశీయ సూచీలు..



అమెరికా ట్రేడ్ డీల్ కారణంగా గత మూడు సెషన్లుగా లాభపడుతూ వచ్చిన దేశీయ సూచీలు గురువారం నష్టాల బాట పట్టాయి. గరిష్టాల వద్ద మదుపర్లు లాభాల స్వీకరణకు దిగడంతో స్టాక్ మార్కెట్లు నష్టాల్లో చలిస్తున్నాయి. ముఖ్యంగా మిడ్, స్మాల్ క్యాప్ స్టాక్స్ ఎక్కువగా అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. అంతర్జాతీయంగా మెటల్ ధరలు పడిపోవడవంతో ఆ సెక్టార్ దాదాపు రెండు శాతం నష్టపోయింది. మరోవైపు అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూల సంకేతాల వల్ల కూడా ప్రస్తుతం సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ఉన్నాయి గత సెషన్ ముగింపు (83,817)తో పోల్చుకుంటే గురువారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో ఐదు వందల పాయింట్లకు పైగా కోల్పోయింది అయితే కాసేపటికి భారీ నష్టాల నుంచి కోలుకుంది. ప్రస్తుతం ఉదయం 10:30 గంటల సమయంలో సెన్సెక్స్ 331 పాయింట్ల నష్టంతో 83,486 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 118 పాయింట్ల నష్టంతో 25,651 వద్ద కదలాడుతోంది (రిశీఎని ఝితీనెవ్ అవఙర్ శీఞుం). సెన్సెక్స్‌లో బజాజ్ హోల్డింగ్స్, నైకా, బ్యాంక్ ఆఫ్ ఇండియా, జుబిలెంట్ ఫుడ్స్, యూనియన్ బ్యాంక్ మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి . ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్, హిందుస్థాన్ జింక్, వేదాంత, కేన్స్ టెక్నాలజీస్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 387 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 90 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 90.41గా ఉంది.

---

## ఢిల్లీని ముంచిన ఫైనల్ ఫోబియా.. రెండోసారి ఛాంపియన్‌గా ఆర్సీబీ..!




మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్లో రికార్డు స్కోర్ కొట్టినా ఢిల్లీ క్యాపిటల్స్ కల సాకారమవ్వలేదు. తొలి కప్‌ను ఒడిసిపట్టాలని భారీ లక్ష్యాన్ని నిర్దేశించినా.. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు ఉఫ్‌మనిపించింది. జార్జియా వోల్(79), కెప్టెన్ స్మృతి మంధాన(87)లు వీరవిహారం చేశారు. పసలేని ఢిల్లీ బౌలింగ్‌ను తుత్తునియలు చేస్తూ బౌండరీల మోతతో చెలరేగారు. వీరిద్దరూ రెండో వికెట్‌కు 165 పరుగుల జోడించి.. ఆర్సీబీని గెలుపు దిశగా నడిపారు. వోల్, మంధాన ఔటయ్యాక డీ క్లెర్క్ (6 నాటౌట్), రాధా యాదవ్(8 నాటౌట్) లాంఛనం పూర్తి చేచేశారు. అంతే.. నాలుగోసారైనా కప్‌ను ముద్దాడాలనుకున్న ఢిల్లీ ఫైనల్ ఫోబియాతో మంచి అవకాశాన్ని చేజార్చుకుంది.డబ్ల్యూపీఎల్ చరిత్రలో మరోసారి రన్నరప్ ట్యాగ్‌కే పరిమితమైంది ఢిల్లీ క్యాపిటల్స్. వడోదరలోగురువారం జరిగిన ఫైనల్లో రికార్డు స్కోర్ చేసినా ఆర్సీబీ ముందు ఢిల్లీ నిలువలేకపోయింది. భారీ ఛేదనలో తొలి ఓవర్లో రెండు ఫోర్లు బాదిన గ్రేస్ హ్యారిస్(8)ను హెన్రీ ఔట్ చేసింది. ఆ తర్వాత కెప్టెన్ స్మృతి మంధాన(87)జతగా జార్జియా వోల్(74) బౌండరీలతో చెలరేగింది. అర్ధ శతకం పూర్తి చేసుకుంది. కాసేపటికే మంధాన సైతం ఫిఫ్టీ అందుకుంది. వీరిద్దరు శతక భాగస్వామ్యంతో ఆర్సీబీని గెలుపు దిశగా నడిపారు. 165 రన్స్ జోడించిన ఈ ద్వయాన్ని ఎట్టకేలకు మిన్ను మని విడదీసింది.కానీ, అప్పటికే బెంగళూరు విజయం ఖాయమైంది. 21 బంతుల్లో 30 రన్స్ కావాలంతే. రీచా ఘోష్(6)ను నందిని శర్మ వెనక్కి పంపగా ఢిల్లీ జట్టులో ఆశలు చిగురించాయి. కానీ, నడినే డీక్లెర్క్() బౌండరీతో .. ఉంది. హెన్రీ ఓవర్లో స్వీప్ షాట్ ఆడబోయిన మంధాన బౌల్డ్ కావడంతో ఉత్కంఠ నెలకొంది. ఆ తర్వాత బంతికే రాధా యాదవ్ ఇచ్చిన క్యాచ్‌ను మిన్ను మని నేలపాలు చేసింది. ఆఖరి ఓవర్లో 10 పరుగులు అసవరమవ్వగా.. రాధా యాదవ్ (8 నాటౌట్) రెండు బౌండరీలు బాదింది. 6 వికెట్ల తేడాతో గెలుపొందిన ఆర్సీబీ రెండోసారి విజేతగా నిలిచింది.

హెన్రీ, జెమీమా విధ్వంసం..

మొదట ఢిల్లీ క్యాపిటల్స్ బ్యాటర్లు శివమెత్తారు. వచ్చినవాళ్లు వచ్చినట్టు దంచేయగా డబ్ల్యూటీసీ టైటిల్ పోరులో ఢిల్లీ రికార్డు స్కోర్‌తో చరిత్రకెక్కింది. ఓపెనర్లు శుభారంభమివ్వగా.. జెమీమా రోడ్రిగ్స్(57) కెప్టెన్ ఇన్నింగ్స్‌తో చెలరేగింది. ఒత్తిడికి లోనైన ఆర్సీబీ బౌలర్లను ఆఖర్లో లారా వొల్వార్డ్(44), చిన్నెల్లీ హెన్రీ(32 నాటౌట్) బెంబేలెత్తించారు. డీక్లెర్క్ వేసిన 18వ ఓవర్లో ఆకాశమే హద్దుగా రెచ్చిపోయిన హెన్రీ 24 రన్స్ రాబట్టగా.. చివరి ఓవర్లో పది రన్స్ రావడంతో బెంగళూరుకు 204 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది.

## పాక్ తో ఆడటానికి నో చెప్పలేదు, వారే నో చెప్పారు

**టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్**




మరో రెండు రోజుల్లో టీ20 ప్రపంచకప్ 2026 ప్రారంభం కానుంది. అయితే.. ఈ మెగా టోర్నీలో భారత్‌తో మ్యాచ్‌ను ఆడబోమని పాక్ ప్రభుత్వం మరోసారి స్పష్టం చేసింది. ఫిబ్రవరి 15న కొలంబో వేదికగా భారత్, పాక్ జట్ల మధ్య మ్యాచ్ జరగాల్సి ఉంది. పాక్ ప్రభుత్వ నిర్ణయం కారణంగా భారత్, పాక్ మ్యాచ్ పై అనిశ్చితి ఏర్పడింది. తాజాగా భారత్‌తో మ్యాచ్ ఆడమని పాక్ ప్రభుత్వ ప్రకటనపై టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తొలిసారి స్పందించాడు. పాకిస్తాన్‌తో మ్యాచ్ ఆడమని తాము ఎన్నడూ చెప్పలేదన్నాడు. ఆ జట్టుతో మ్యాచ్ ఆడేందుకు తాము కొలంబో వెళతామన్నాడు. ఇప్పటికే ఇందుకు సంబంధించిన ఫ్లైయిన్ టికెట్స్ కూడా బుక్ అయ్యాయని తెలిపాడు. సూర్యకుమార్ ఏం మాట్లాడంటే.. మా వైఖరి చాలా స్పష్టంగా ఉంది. మేము వారితో (పాక్) ఆడటానికి నో చెప్పలేదు, వారే నో చెప్పారు. మా విమానాలు బుక్ అయ్యాయి. మేము కొలంబోకు వెళ్తున్నాము. మేం మొదట యూఎస్‌తో ఆ తరువాత నమీబియాతో ఆడతాం. ఆ తరువాత కొలంబో వెళతామని సూర్యకుమార్ యాదవ్ విలేకరుల సమావేశంలో తెలిపాడు. ఐసీసీ టీ20 ప్రపంచ కప్ గ్రూప్ స్టేజ్ లో భారత్‌తో మ్యాచ్‌ను ఆడమని మరోసారి పాకిస్తాన్ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ విషయాన్ని ప్రధాన షెహబాజ్ షరీఫ్ తెలిపారు. దీనిపై బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా స్పందించారు. పాకిస్తాన్ ప్రభుత్వ నిర్ణయంతో బీసీసీఐకి ఎలాంటి సంబంధం లేదన్నాడు. ఐసీసీనే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఐసీసీ ఏ నిర్ణయం తీసుకున్నా కూడా దానికి తాము కట్టుబడి ఉంటామన్నాడు.

# స్పోర్ట్స్

## వయసు 30 దాటితే అనర్హులా?.. వరల్డ్‌కప్‌లో కోహ్లీ, రోహిత్ ఎందుకు ఆడొద్దు..?




రాబోయే వన్డే వరల్డ్‌కప్‌లో విరాట్ కోహ్లీ రోహిత్ శర్మ లకు అవకాశం దక్కేనా? అనే ప్రశ్న అభిమానులను వెంటాడుతూనే ఉంది. వన్డే ఫార్మాట్‌లో మాత్రమే కొనసాగుతున్న రో-కో అనుభవం ప్రపంచకప్‌లో భారత జట్టుకు చాలా అవసరమని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మాజీ కెప్టెన్ మహేంద్ర సింగ్ ధోనీ సైతం ఇదే మాట అంటున్నాడు. 2027 వన్డే ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఎందుకు ఆడొద్దు అని మహీ భాయ్ ప్రశ్నించాడు.టీ20లు, టెస్టులకు వీడ్కోలు పలికిన విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు వన్డేల్లో మాత్రమే ఆడుతున్నారు. వచ్చే ఏడాది ప్రపంచకప్‌తో కెరీర్ ముగించాలనే ఆలోచనల్లో ఉన్న ఈ ద్వయం కల నెరవేరుతుందా? అనేది ప్రశ్నార్థంగా మారింది. ఈ నేపథ్యంలో.. ధోనీ తన హయాంలో ఆడిన విరాట్, రోహిత్‌కు మద్దతు పలికాడు. ఇటీవల 'మహీ అన్‌ప్లగ్డ్' అనే కార్యక్రమంలో పాల్గొన్న మహీ.. వయసు అనేది ఒక అంశం మాత్రమే. ఫామ్, ఫిట్‌నెస్.. ఈ రెండే చాలా కీలకం. కాబట్టి ప్రస్తుతం ఫామ్‌తో, ఫిట్‌గా ఉన్న విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు వచ్చే వన్డే ప్రపంచకప్‌లో ఎందుకు ఆడకూడదు? అని ప్రశ్నించాడు.వయసు 30 దాటినంత మాత్రాన వారిద్దరూ వచ్చే ప్రపంచకప్ ఆడకూడదా? రో-కో భవితవ్యాన్ని నిర్ణయించాల్సింది మనం కాదు. వారే నిర్ణయం తీసుకోవాలి. ఫామ్‌తో, ఫిట్‌నెస్‌తో ఉండి జట్టును గెలిపిస్తున్నప్పుడు వారిని అడ్డుకోవడం దేనికి? అని తన అభిప్రాయం వెలిబుచ్చాడు ధోనీ. ఒకప్పుడు కెప్టెన్‌గా కోహ్లీ, రోహిత్‌లను ప్రోత్సహించిన అతడు.. ఇప్పుడు టీమిండియా ప్రయోజనాలరీత్యా వీరికి బాసటగా నిలుస్తున్నాడు. ప్రస్తుతం రోహిత్ 38 ఏళ్లుండగా.. కోహ్లీకి 37 ఏళు న్నాయి.నిరుడు ఆస్ట్రేలియా పర్యటనతో వన్డే పగ్గాలు శుభ్‌మన్ గిల్‌కు అప్పగించడం.. యువకులను సానబెట్టాలనుకోవడం వంటివి కోహ్లీ, రోహిత్‌లకు సవాల్ విసురుతున్నాయి. ఆసీస్ సిరీస్ కోసం కఠోరంగా శ్రమించి సన్నబడిన రోహిత్.. సిడ్నీ వన్డేలో రోహిత్ శతకంతో గర్జిస్తే.. హాఫ్ సెంచరీతో కోహ్లీ ఫామ్ అందుకున్నాడు. ఆపై స్వదేశంలో దక్షిణాఫ్రికాపై విరాట్ వరుసగా రెండు సెంచరీలతో రికార్డు నెలకొల్పాడు. న్యూజిలాండ్‌పై హిట్‌మ్యాన్ విఫలమైనా.. కోహ్లీ చెలరేగి ఆడాడు. వచ్చే వరల్డ్‌కప్ సన్నాహక సిరీస్‌లలోనూ పరుగుల వరద పారిచేందుకు కాచుకొని ఉన్నారిద్దరూ. అయితే.. హెడ్‌కోచ్ గౌతం గంభీర్‌తో విరాట్, హిట్‌మ్యాన్ అంటీముట్టనట్టే ఉంటున్నారు. చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ సైతం రో-కోకు వరల్డ్‌కప్ అవకాశం ఇస్తాడనే నమ్మకం లేదు. అయితే.. ఫామ్‌లో ఉండేందుకు దేశవాళీ క్రికెట్‌లోనూ ఆడుతున్న ఈ లెజెండ్స్‌కు వరల్డ్‌కప్ అవకాశమిచ్చి గౌరవంగా వీడ్కోలు పలకాలని విశ్లేషకులు చెబుతున్నారు.



# నేటి నుంచి ఓటీటీలోకి రాజాసాహెబ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా, దర్శకుడు మారుతి కాంబినేషన్‌లో వచ్చిన క్రేజీ హారర్-కామెడీ మూవీ 'ది రాజాసాబ్' ఓటీటీలోకి రాబోతున్న విషయం తెలిసిందే. ఇటీవలే ప్రేక్షకుల ముందుకు వచ్చి మిక్స్‌డ్ టాక్ తెచ్చుకున్న ఈ చిత్రం విడుదలైన నెల రోజుల్లోపై ఓటీటీ అనౌన్స్‌మెంట్‌ను పంచుకుంది. ప్రముఖ ఓటీటీ సంస్థ జియో హాట్‌స్టార్ అత్యంత భారీ ధరకు ఈ సినిమా హక్కులను సొంతం చేసుకోగా.. ఫిబ్రవరి 6 నుంచి ఈ సినిమా జియో హాట్‌స్టార్‌లో తెలుగుతో పాటు తమిళం, హిందీ భాషల్లో స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అయితే ఓటీటీ వెర్షన్‌కి సంబంధించి గుడ్ న్యూస్ తెలిపింది చిత్రయూనిట్. ఈ సినిమా ఎక్స్‌టెండెడ్ కట్‌తో ఓటీటీలోకి రాబోతున్నట్లు ప్రకటించింది. దీంతో థియేటర్‌లో మిస్ అయిన ప్రేక్షకులకి ఇది గుడ్ న్యూస్ అని చెప్పవచ్చు. ప్రభాస్‌ను వింటేజ్ లుక్‌లో చూపిస్తూ మారుతి తెరకెక్కించిన ఈ చిత్రంలో సంజయ్ దత్, మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ ముఖ్య పాత్రలు పోషించారు. ఈ సినిమా కథ విషయానికి వస్తే.. రాజు అలియాస్ రాజాసాబ్ (ప్రభాస్)కు అమ్మానాన్న అన్నీ నాయనమ్మ గంగాదేవి(జరీనా వహాబ్)నే. గంగాదేవికి అల్జీమర్స్. ప్రతి విషయాన్ని మర్చిపోతుంటుంది. కాకపోతే ఎప్పుడో తనని విడిచిపెట్టి వెళ్ళిపోయిన భర్త కనకరాజు (సంజయ్‌దత్)ని మాత్రం గుర్తుపెట్టుకుంటుంది. తాత కనకారాజు కోసం వెదుకుతున్న రాజుకు కొన్ని సంచలన నిజాలు తెలుస్తాయి. నర్సాపూర్ అడవిలోని ఓ రాజమహల్ వున్నాడనే సంగతి తెలుసుకుంటాడు. ఆ రాజమహల్ అడుగుపెట్టిన రాజుకి ఎలాంటి అనుభవాలు ఎదురయ్యాయి ? కనకరాజు గురించి ఎలాంటి నిజాలు తెలుసుకున్నాడు? అసలు గంగాదేవి గతం ఏమిటి? కనకరాజు గంగాదేవిని ఎందుకు వదిలివెళ్ళిపోయాడు? తన లక్ష్యం ఏమిటి? నాయనమ్మ కోసం రాజు ఎలాంటి పోరాటం చేశాడనేది మిగతా కథ.



## జాన్వీ మరో క్రేజీ ఆఫర్ కొట్టేసిందా?




# మరోసారి లాయర్ అవతారంలో తాప్సీ..

## ఆకట్టుకుంటున్న 'అస్సీ' ట్రైలర్

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ తాప్సీ పన్ను తన విలక్షణ నటనతో మరోసారి ప్రేక్షకులను పలకరించేందుకు సిద్ధమయ్యింది. ప్రముఖ దర్శకుడు అనుభవ్ సిన్హా దర్శకత్వంలో ఆమె ప్రధాన పాత్రలో నటించిన తాజా చిత్రం 'అస్సీ'. ఈ సినిమా ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా చిత్రబృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. తాప్సీ ఇందులో మరోసారి లాయర్ పాత్రలో(ఇంతకుముందు ముల్క్ చిత్రంలో) కనిపించబోతుంది. ఈ సినిమా టైటిల్‌ను హైలైట్ చేస్తూ.. దేశంలో ప్రతిరోజు 80 మంది మహిళలు అత్యాచారానికి గురవుతున్నారని.. వారికోసం పోరాడే న్యాయవాది పాత్రలో తాప్సీ అలరించబోతుంది.అనుభవ్ సిన్హా-తాప్సీ కాంబినేషన్‌లో గతంలో వచ్చిన 'ముల్క్', 'థప్పడ్' చిత్రాలు సామాజిక అంశాలతో ఘనవిజయం సాధించాయి, దీంతో ఈ హ్యాట్రిక్ మూవీపై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ కోర్ట్‌రూమ్ డ్రామాలో నసీరుద్దీన్ షా, రేవతి, కని కుస్రుతి, మనోజ్ పహ్వా వంటి దిగ్గజ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.



# ఆ హీరోలంటే నాకు పిచ్చి..

## ఛాన్స్ దొరికితే వారితో నటించాలని ఉందన్న ధన్య బాలకృష్ణ

ధన్య బాలకృష్ణ.. తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమే.. టాలీవుడ్, కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. ధన్య బాలకృష్ణ ఎక్కువగా సైడ్ రోల్స్ చేసింది. పేరుకు సైడ్ క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా నటించినా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును సంపాదించుకుంది నటి ధన్య బాలకృష్ణ. సీతమ్మ వాకిట్లో సిరిమల్లె చెట్టు, సాఫ్ట్‌వేర్ సుధీర్ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుందీ ముందుగుమ్మ. నటన, అందంతో ఆకట్టుకుంటూ మంచి గుర్తింపు సంపాదించుకుంటుంది. వరుస అవకాశాలను సొంతం చేసుకుంటూ దూసుకెళుతోంది. ప్రస్తుతం ఈ అమ్మడు అంత ఆఫర్స్ అందుకోలేకపోతుంది. కోలీవుడ్ ఇండస్ట్రీల్లో ఎన్నో చిత్రాల్లో సహాయ నటిగా కనిపించింది. చాలా కాలంగా తెలుగులో కనిపించలేదు. ఇప్పుడు మరోసారి తెలుగులో సినిమా చేసి మెప్పించనుంది. తెలుగులో సాఫ్ట్ వేరు సుధీర్, నేను శైలజ, రాజు గారి గది, కార్బన్ వంటి చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకుంది. అటు వెండితెరపైనే కాకుండా డిజిటల్ ప్లాట్ ఫాంలోనూ పలు వెబ్ సిరీస్ చేస్తూ రాణిస్తోంది. అలాగే సోషల్ మీడియాలోనూ యాక్టివ్ గా ఉంటుంది ఈ చిన్నది. గతంలో ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా అభిమానులతో ముచ్చటించింది. ఈ సందర్భంగా అభిమానులు అడిగిన పలు ప్రశ్నలకు ఆసక్తికర సమాధానాలు చెప్పిందీ బ్యూటీ. ఆ కామెంట్స్ ఇప్పుడు మరోసారి వైరల్ అవుతున్నాయి. సోషల్ మీడియా చాట్ లో ధన్య మాట్లాడుతూ.. పవన్ కల్యాణ్, సూర్య, రణ్‌బీర్ కపూర్ తన క్రష్‌లని.. ఛాన్స్ దొరికితే వారితో నటించాలని ఉందని చెప్పుకొచ్చింది. ఇక ఓ సినిమాలో మద్యం తాగిన సన్నివేశం గురించి అభిమాని ప్రశ్నించగా.. కేవలం మందు తాగినట్లు చూపించారు. కానీ అది నిజం కాదు. నేను తాగింది కేవలం నీళ్లు మాత్రమేనని చెప్పుకొచ్చింది. ఇక ఈ చిన్నది కేవలం క్యారక్టర్ ఆర్టిస్ట్‌లకే పరిమితం కాకుండా.. హీరోయిన్‌గానూ పలు చిత్రాల్లో నటించింది. సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉండే ధన్య రెగ్యులర్ గా తన గ్లామరస్ ఫోటోలను పంచుకుంటూ అభిమానులను కవ్విస్తుంది. ఈ అమ్మడి ఫోటోలకు మంచి క్రేజ్ ఉంటుంది.

# 25 రోజుల్లో రూ. 375 కోట్లు..

## ఆల్-టైమ్ రీజినల్ హిట్‌గా 'మన శంకర వరప్రసాద్ గారు'




మెగాస్టార్ చిరంజీవి -అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో వచ్చిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం బాక్సాఫీస్ వద్ద రికార్డుల సునామీ సృష్టిస్తూ ప్రభంజనం కొనసాగిస్తోంది. తాజాగా ఈ చిత్రం థియేటర్లలో 25 రోజులు పూర్తి చేసుకోగా.. ఈ 25 రోజుల్లో ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం రూ.375 కోట్ల భారీ గ్రాస్ వసూళ్లను సాధించి రూ.400 కోట్ల దిశగా దూసుకెళుతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అలాగే ఈ చిత్రం తెలుగులో ఆల్-టైమ్ రీజినల్ ఇండస్ట్రీ హిట్ గా నిలిచి చరిత్ర సృష్టించినట్లు చిత్రబృందం ప్రకటించింది.కేవలం తెలుగు వెర్షన్‌లో మాత్రమే విడుదలై ఈ స్థాయిలో రూ.375 కోట్లు రాబట్టడం టాలీవుడ్ చరిత్రలోనే అత్యంత అరుదైన రికార్డుగా ట్రేడ్ నిపుణులు అభివర్ణిస్తున్నారు. చిరంజీవి తన మార్కు 'వింటేజ్ స్వాగ్' తో అలరించగా, అనిల్ రావిపూడి మార్కు వినోదం, విక్టరీ వెంకటేష్ స్పెషల్ క్యామియో ఈ సినిమా విజయానికి ప్రధాన బలంగా నిలిచాయి. చిరంజీవి సరసన నయనతార నటించిన ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో అందించిన సంగీతం పెద్ద ప్లస్ పాయింట్ అయ్యింది. షైన్ స్క్రీన్స్ మరియు గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్మెంట్స్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం, చిరంజీవి కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన సినిమాగా నిలిచి ప్రాంతీయ సినిమా సత్తాను చాటిచెప్పింది. కాగా, థియేటర్లలో కాసుల వర్షం కురిపిస్తున్న ఈ చిత్రం ఫిబ్రవరి 11 నుంచి వవ5 వేదికగా స్ట్రీమింగ్ అయ్యే అవకాశం ఉందని సమాచారం.

# మృణాల్ ఠాకూర్ 'దో దీవానే షెహర్ మే' ట్రైలర్ రిలీజ్




బాలీవుడ్ స్టార్ నిర్మాత సంజయ్ లీలా భన్సాలీ నిర్మాణంలో సిద్ధాంత్ చతుర్వేది, మృణాల్ ఠాకూర్ జంటగా నటిస్తున్న రొమాంటిక్ డ్రామా 'దో దీవానే షెహర్ మే'. ఈ చిత్రం ఫిబ్రవరి 20న ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. తాజాగా చిత్రయూనిట్ ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ ట్రైలర్ చూస్తుంటే.. అరేంజ్డ్ మ్యారేజ్ సెటప్‌లో కలిసిన ఇద్దరు వ్యక్తులు (శశాంక్ మరియు రోష్ని) మధ్య చిగురించిన ప్రేమ చుట్టూ ఈ కథ తిరుగుతుంది. శశాంక్ (సిద్ధాంత్) తన ఉచ్చారణ సమస్యలతో ఇబ్బంది పడుతుంటే, రోష్ని (మృణాల్) తన అందం విషయంలో బాధపడుతూ ఉంటుంది. ఇద్దరు అసంపూర్ణమైన వ్యక్తులు ఒకరినొకరు ఎలా అర్థం చేసుకున్నారనేదే ఈ సినిమా. నేటి తరం యువత ప్రస్తుతం ఎదుర్కొంటున్న అభద్రతా భావం, ఒత్తిడి, నిజమైన ప్రేమ వెతుకులాటను ప్రతిబింబించేలా ఈ సినిమాను దర్శకుడు రవి ఉద్యవార్ తెరకెక్కించాడు.తెలుగులో 'ఖుషి', 'హాయ్ నాన్న' వంటి చిత్రాలతో సెన్సేషన్ క్రియేట్ చేసిన సంగీత దర్శకుడు హేషమ్ అబ్దుల్ వహాబ్ ఈ సినిమాతోనే బాలీవుడ్‌కు పరిచయం అవుతుండటం విశేషం. భన్సాలీ ప్రొడక్షన్స్ మరియు జీ స్టూడియోస్ సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రంలో ఇలా అరుణ్, జాయ్ సేన్ గుప్తా కీలక పాత్రలు పోషించారు.

Printer. Publisher and owned by Dr k Soumya, and printed it kalanjali offset printers, shop no.23, sowjanya complex, N.K road , Srinivas Nagar, nandyal-518501 shop no 7, Sai revenue complex, mro office complex, nandyal town -518501 nandyal district (AP) editor: Dr k Sowmya. Email: editor@dream Times.in, editor@dream Times.co.in, cell:8500066609,RNI NO:APTEL 2021/81831